teenmaardesk@gmail.com
RNI no TELTEL/2021/86151

# తీన్మార్

నేటి వాస్తవాలు...
తెలుగు దిన పత్రిక

ములుగు | సంపుటి : 03 | సంచిక : 281 | ఛీఫ్ ఎడిటర్ : రెడ్డి శేఖర్ | గురువారం | 20 ఫిబ్రవరి 2025 | పేజీలు : 08 | వెల ₹5

Published from Mulugu Circulated by Warangal, Khammam, Hyderabad, Nalgonda, Mahabubnagar, Rangareddy,Medak, Karimnagar,Nizamabad, Adilabad.

## నేడు విడుదలకానున్న టీజీఎప్ సెట్ నోటిఫికేషన్

### ఈ మేరకు ప్రకటించిన ఉన్నత విద్యామండలి

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): టీజీఎప్ సెట్ -2025 నోటిఫికేషన్ గురువారం విడుదల చేయనున్నట్టు ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఈ నెల 25 నుంచి ఆన్ లైన్ దరఖాస్తులు ప్రారంభం అవుతాయని ఉన్నత విద్యామండలి తెలిపింది. పూర్తి వివరాల కోసం https://eapcet.tgche.ac.in ను సందర్శించాలని వెల్లడించింది. కాగా, ఈ సారి పరీక్షలను జవహార్ లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జెఎన్టీయూ హెచ్) నిర్వహించనుంది. ఎప్ సెట్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ ద్వారా అగ్రికల్చర్, ఫార్మసీ, ఇంజనీరింగ్ విభాగాల్లో ప్రవేశాలను కల్పిస్తారు. ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కర్నూల్ ను టెస్ట్ జోన్ లుగా పరిగణించనున్నట్టు ఉన్నత విద్యామండలి పేర్కొంది.






# రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ రచ్చ

## కేంద్రమే పరిహార నిర్ణయం తీసుకుందని రాష్ట్రం

- రాష్ట్రమే రైతులకు అన్యాయం చేస్తుందని కేంద్రం
- కేంద్ర ప్రభుత్వం వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వంగా ఆరోపణలు
- పరిహారం సరిపోదని పెద్ద ఎత్తున రైతుల ఆందోళనలు

తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణపైన రచ్చ కొనసాగుతుంది. రైతులు గ్రీన్ ఫీల్డ్ హైవే కోసం తాము ఇచ్చే భూములకు ప్రభుత్వం ఇస్తామని చెప్పిన పరిహారం సరిపోదని పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నారు. ఈ క్రమంలో నింద కేంద్రం పైన వేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందని, అయితే రాష్ట్ర

మిగతా 2 లో



## ఎల్ఆర్ఎస్ అమలులో వేగం పెంచనున్న ప్రభుత్వం

### ఈ మేరకు ప్రభుత్వం నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): రాష్ట్రంలోని పేదలకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ తెలిపింది. సుదీర్ఘకాలంగా పెండింగ్లో ఉన్న ఎల్ఆర్ఎస్ (భూ క్రమబద్ధీకరణ పథకం) అమలులో వేగం పెంచాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకం అమలు ప్రగతిపై బుధవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, దుదిల్ల శ్రీధర్ బాబులు పాల్గొన్నారు. ఎల్ఆర్ఎస్ పథకం అమలులో వేగం

మిగతా 2 లో






## కృష్ణా జలాల కేటాయింపులపై కేంద్రం చొరవ తీసుకోవాలి

### నీటీ పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణా జలాల కేటాయింపుల సమస్యపై కేంద్రం చొరవ తీసుకోవాలని తెలంగాణ నీటీ పారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోరారు. కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో వాటర్ విజన్ సదస్సులో ఆయన రాష్ట్రానికి సంబంధించిన నీటి ప్రాజెక్టులు, నిధుల ఆవశ్యకత అంశాలను వివరించారు. కృష్ణా జలాల

మిగతా 2 లో

## ఫోన్ టాపింగ్ కేసులో హరీష్‌రావు బిగ్ రిలీఫ్

### ఆదేశించే వరకు అరెస్ట్ చేయవద్దని పోలీసులకు ఆదేశాలు



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): ఫోన్ టాపింగ్ కేసులో మాజీ మంత్రి హరీష్ రావు బిగ్ రిలీఫ్ లభించింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్ (పంజాగుట్ట పోలీస్ స్టేషన్)లో ఆయనపై నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ మాజీ మంత్రి హరీశ రావు దాఖలు

మిగతా 2 లో

## అధికారులకు ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్

### కొందరు అధికారులకు పట్టిన గతే పడుతుంది అంటూ సూచనలు

### ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలి



వరంగల్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): అధికారులకు బీజేపీ కీలక నేత, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్ ఇచ్చారు. బుధవారం ఆయన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన మీడియా

మిగతా 2 లో



## అనూహ్యంగా పెరిగిపోతున్న విద్యుత్తు డిమాండ్

- 16వేల మెగావాట్ల మైలురాయిని దాటేసిన డిమాండ్
- విద్యుత్ సంస్థల సీఎండీలతో సరఫరాపై డెప్యూటీ సీఎం సమీక్ష

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ విద్యుత్తు డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోతుంది. రాష్ట్ర విద్యుత్తు డిమాండ్ బుధవారం ఉదయం రికార్డు స్థాయిలో 16వేల మెగావాట్లకు మైలురాయిని

మిగతా 2 లో

## మాకు తెలంగాణ అస్థిత్వం ముఖ్యం

### తెలంగాణ రక్షణ కవచం బీఆర్ఎస్సే

### బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీర్



హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): మాకు తెలంగాణ అస్థిత్వం ముఖ్యం తెలంగాణ రక్షణ కవచం బీఆర్ఎస్సే అన్నారు కేటీఆర్. చరిత్ర ప్రసవించిన బిడ్డ బీఆర్ఎస్ అధికారం కోసం మేం ఏనాడు పనిచే యలేదు. ప్రజలకోసం ప్రభుత్వ వైఫల్యాలను ప్రధాన ప్రతిపక్షంగా ఎండగడతామన్నారు. ప్రజల త్యాగాలు వృధా కాకుండా పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 25యేళ్ల చరిత్ర ఉంది. చరిత్ర ప్రసవించిన బిడ్డ బీఆర్ఎస్ తెలంగాణకు రక్షణ

మిగతా 2 లో



## హైదరాబాద్- విజయవాడ సర్వీస్ లో ప్రత్యేక రాయితీ

టీజీఆర్టీసీ ఎండీ వీ.సీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా వెల్లడి

02



## చర్లపల్లి టర్మినల్ నుండి ధనాపూర్ కి ప్రత్యేక రైళ్లు

- ప్రకటించిన దక్షిణ మధ్య రైల్వే
- కుంభమేళాకు రద్దీ పెరుగుతుండగా నిర్ణయం

02



## మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి ఫైర్

### పార్టీ నేతలు, కార్యకర్తలతో కేసీఆర్ సమావేశం

### పార్టీ సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ చేయాలని నిర్ణయం

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తమ పార్టీ నేతలు, కార్యకర్తలతో తెలంగాణ భవన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర

మిగతా 2 లో

## ఐదు రాష్ట్రాలకు కేంద్ర విపత్తు సాయం

- ఐదు రాష్ట్రాలకు కలిపి రూ. 1,554.99 కోట్లు రిలీజ్
- పెద్ద మొత్తంలో ఏపీకి రూ. 608.08 కోట్లు కేటాయింపు
- తెలంగాణకు రూ. 231.75 కోట్లు



# రాష్ట్రంలో గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ రచ్చ

మొదటి పేజీ తరువాయి


ప్రభుత్వమే రైతుల విషయంలో సానుకూలంగా లేదని బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ పేర్కొన్నారు.

గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ విషయంలో రచ్చ

కేంద్ర ప్రభుత్వం వర్సెస్ రాష్ట్ర ప్రభుత్వం అన్నట్టు గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణ పరిహారం విషయంలో జరుగుతున్న రచ్చ అంతా ఇంతా కాదు. రైతులు నిరసనలు చేస్తూ భూసేకరణను అడ్డుకుంటున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం తక్కువ పరిహారం నిర్ణయించటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వారు వాపోతున్నారు. అయితే నేషనల్ హైవే కోసం సేకరించే భూములను రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాలని, ఇందుకు కేంద్రం డబ్బులు చెల్లిస్తుంది.

## రైతుల డిమాండ్ ఇదే

రాష్ట్రప్రభుత్వం సరైన ధర నిర్ణయించి కేంద్రానికి పంపాలని రైతులు కోరుతున్నారు. అయితే కేంద్రమే పరిహారం విషయంలో నిర్ణయం తీసుకుందని రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్రమే రైతులకు అన్యాయం చేస్తుందని కేంద్రం చెప్తున్న పరిస్థితి ఉంది. ఈ క్రమంలో రాష్ట్రంలోని రేవంత్ సర్కార్ తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరిహారం విషయంలో కేంద్రంపై అపవాదు వేయడం సమంజసం కాదు. తెలంగాణ రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని, లేదంటే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని చెప్తున్న రైతాంగానికి బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ తమ మద్దతు తెలిపారు.




భూసేకరణ కోసం కలెక్టర్లతో కమిటీ వేసి ప్రాంతాలవారీగా వాస్తవ ధరలు నిర్ణయించాలని, ఆ నివేదికను కేంద్రానికి పంపాలని వారు చెప్తున్నా రాష్ట్రం మాత్రం ఈ విషయంలో స్పందించటం లేదని అంటున్నారు.

**పరిహారం నష్టం కలగకుండా ఇస్తేనే భూములు ఇస్తామన్న రైతులు**

తెలంగాణా రాష్ట్రంలో హైవేల నిర్మాణం కోసం కేంద్రం దూకుడుగా ముందుకు వెళ్తుందని బీజేపీ నేతలు చెప్తుంటే, ఏ ఇబ్బంది అయినా కేంద్రం వల్లే వస్తుందని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు కాంగ్రెస్ నేతలు. ఏది ఏమైనా తెలంగాణా ప్రగతి కోసం నిర్మాణం చేస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే విషయంలో రెండు ప్రభుత్వాల మధ్య వివాదం పరిష్కారం కావాలని, రైతులకు నష్టం కలగకుండా చూడాలని భూములను ఇవ్వం అంటున్న రైతులు కోరుతున్నారు. పరిహారం నష్టం కలగకుండా ఇస్తేనే భూములు ఇస్తామని అంటున్నారు.

# ఎల్ఆర్ఎస్ అమలులో వేగం పెంచనున్న ప్రభుత్వం

మొదటి పేజీ తరువాయి

పెంచే కార్యక్రమంలో భాగంగా 25 శాతం రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్లాట్ కొనుగోలుదారులకు ఈ రాయితీని మార్చి 31 వరకు వెసులుబాటు కల్పించింది. దీంతో పాటు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకోని వారికి, లే అవుట్లో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్ కు పలు వెసులుబాట్లు కల్పిస్తూ మంత్రులు నిర్ణయం తీసుకున్నారు. ఒక లేఅవుట్లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉండి మిగిలిపోయిన 90 శాతం ప్లాట్ లకు ఎల్ఆర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్ కు అవకాశం కల్పించారు. వీరు కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం కల్పించాలని నిర్ణయించారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా 31 లోగా ఎల్ఆర్ఎస్ చేసుకుంటే 25 శాతం రాయితీ కల్పిస్తూ మంత్రులు నిర్ణయం తీసుకున్నారు. పేద ప్రజలు, గత నాలుగు సంవత్సరాల నుంచి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం గురించి ఎదురు చూస్తున్నారు. పేదల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రులు విజ్ఞప్తి చేశారు. ఈ పథకాన్ని రోజువారీగా సమీక్షించి నిర్ణయించారు. ఎల్ఆర్ఎస్ అమలులో భాగంగా పలు వెసులుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలని, వీటి విషయంలో కఠినంగా వ్యవహరించాలని మంత్రులు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ఎల్ఆర్ఎస్ పథకాన్ని సులభతరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎల్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ కోసం సంబంధించి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్దనే చెల్లింపులు చేసి ప్లాట్ల రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు.

# కృష్ణా జలాల కేటాయింపులపై కేంద్రం చొరవ తీసుకోవాలి

మొదటి పేజీ తరువాయి

సమస్యలో కేంద్ర ప్రభుత్వ జోక్యం చేసుకోవాలని, పీఆర్ఎల్ఐఎస్, సీతారాం సాగర్, సమ్మక్క సారక్క ప్రాజెక్టులకు ఆమోదం, నిధుల మంజూరీకి చర్యలు తీసుకోవాలని కోరారు. మూసీ నది పునరుజ్జీవనం, గోదావరి- మూసీ లింక్ కోసం నిధులు ఇవ్వాలని కోరారు. కాళేశ్వరం మేడిగడ్డకు సంబంధించి ఎన్డిఎస్ఏ నివేదికను ముందస్తుగా సమర్పించాలని కోరారు. అంతకుముందు తెలంగాణ గ్రామీణ మంచినీటి సరఫరా వ్యవస్థపై రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క ప్రసంగించారు. తెలంగాణ తాగునీటి స్థిరీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం నిధులు పెంచాలని కోరారు. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి మంచినీటి సరఫరాకు వేల కోట్లు వెచ్చిస్తున్నామని నీతి ఆయోగ్ సిఫార్సు చేసిన విధంగా కనీసం రూ.16,000 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్, జల శక్తి మంత్రిత్వ శాఖ కార్యదర్శి దేబాషిష్ ముఖర్జీలు పాల్గొన్నారు.

# ఫోన్ టాపింగ్ కేసులో హరీష్ రావు బిగ్ రిలీఫ్

మొదటి పేజీ తరువాయి

చేసిన క్వాష్ పిటిషన్ వేశారు. దీనిపై బుధవారం విచారణ చేపట్టిన హైకోర్టు హరీష్ రావును ఈ కేసులో అరెస్ట్ చేయవద్దని మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు హరీష్ రావును అరెస్ట్ చేయవద్దని పంజాగుట్ట పోలీసులకు కోర్టు ఆదేశాలు జారీ చేసింది. అనంతరం విచారణను మార్చి 3 కు వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు తెలపింది. అలాగే ఇదే కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న రాధా కిషన్ రావు కు కూడా ఊరట లభించింది. కాగా గతంలో హైదరాబాద్ పంజాగుట్ట పోలీసు స్టేషన్ లో కాంగ్రెస్ నేత జి.చక్రధర్‌గౌడ్ హరీష్ రావుపై ఫిర్యాదు చేశారు. హరీష్ రావు తన ఫోన్‌ను ట్యాప్ చేస్తున్నారని కంప్లైంట్‌లో పేర్కొన్నారు. తన ఫోన్‌తో పాటు తన కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్లను ఇంటెలిజెన్స్ విభాగం సహకారంతో ట్యాప్ చేశారని, దీని వెనుక బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంత్రిగా ఉన్న హరీష్ రావు హస్తం ఉందని చక్రధర్ గౌడ్ ఫిర్యాదు చేశారు. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదు చేసిన కేసులో ఏ1గా హరీష్ రావు, ఏ2గా టాస్క్ ఫోర్స్ మాజీ డీసీపీ రాధాకిషన్‌ను పేర్కొన్నారు.

# చర్లపల్లి టర్మినల్ నుండి ధనాపూర్‌కి ప్రత్యేక రైళ్లు

సికింద్రాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): చర్లపల్లి టర్మినల్ నుండి ధనాపూర్ కి ప్రత్యేక రైళ్లు ప్రకటించింది దక్షిణ మధ్య రైల్వే. కుంభమేళాకు పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఈ ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు తెలిపారు రైల్వే అధికారులు. విజయవాడ, భువనేశ్వర్, అసన్సోల్, పాట్నా మీదుగా చర్లపల్లి, దానాపూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు ప్రకటించారు అధికారులు. మహా కుంభమేళా జరిగే ప్రయాగ్ రాజ్ కు వెళ్లే వారికి దానాపూర్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్లు ఉపయోగపడనున్నాయి. ఆపరేషనల్ ఇష్యూస్ కారణంగా ఈనెల 19, 21 తేదీల్లో సికింద్రాబాద్ టు దానాపూర్ దానాపూర్, టు సికింద్రాబాద్ రైళ్లను రద్దు చేసినట్లు తెలిపారు దక్షిణ మధ్య రైల్వే అధికారులు. దీంతో ముందస్తు బుకింగ్ చేసుకొని ప్రయాణికులకు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక రైళ్లను ధనాపూర్ కి నడిపిస్తున్నట్లు ప్రకటించారు అధికారులు. ఫిబ్రవరి 20 నుండి 28 వరకు చర్లపల్లి రైల్వే టెర్మినల్ నుండి ప్రత్యేక రైళ్లు నడవనున్నాయి.

# మాకు తెలంగాణ అస్థిత్వం ముఖ్యం

మొదటి పేజీ తరువాయి

కవచం బీఆర్ ఎస్ ఒక్కటే అన్నారు కేటీఆర్. పార్టీ సిల్వర్ జూబ్లీ ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహిస్తామన్నారు కేటీఆర్. ప్రజలను మమేకం చేస్తూ రజతోత్సవాలను నిర్వహిస్తామన్నారు. రాబోయే వారం రోజుల్లో కమిటీలు వేస్తామన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణం పటిష్టం చేస్తామన్నారు. ఏప్రిల్ రెండో వారంలో పార్టీ ప్రతినిధులు భేటీ ఉంటుందన్నారు. ఏప్రిల్ 27న భారీ బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు.

# అధికారులకు ఎంపీ ఈటల రాజేందర్ వార్నింగ్



మొదటి పేజీ తరువాయి

సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు చట్టప్రకారం నడుచుకోవాలని సూచించారు. బాస్‌ల ఆదేశాలు కాదు నిబంధనలకు లోబడి పనిచేయాలన్నారు. లేదంటే శ్రీలక్ష్మి సహా కొందరు అధికారులకు పట్టిన గతే పడుతుందని వార్నింగ్ ఇచ్చారు. మేము కూడా ఆరెంజ్ బుక్ మెయిన్‌టైన్ చేస్తున్నాం. ఆ బుక్‌లో అందరి పేర్లు రాసుకుంటున్నాం సమయం వచ్చినప్పుడు లెక్కలతో సహా బయటపెడతాం అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. చట్టం నుంచి ఎవరూ తప్పించుకోలేరు అని అన్నారు. కళ్లు మూసుకొని పిల్లి పాలు తాగినట్లుగా అధికారులు పనిచేస్తే ఎట్టిపరిస్థితుల్లో ఊరుకోము అని సీరియస్ అయ్యారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ప్రచారానికి వెళ్తే ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని తెలిపారు. విద్య వ్యవస్థలను కేసీఆర్ భ్రష్టు పట్టించారని అదే విధంగా కాంగ్రెస్ కూడా ముందుకు సాగుతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ పార్టీకి పడుతుందని అన్నారు. పార్లమెంట్ చట్టం ప్రకారం భూ నిర్వాసితులకు మూడింతలు అధికంగా నష్టపరిహారం ఇవ్వాలని పేర్కొన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఈ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌కు తప్పకుండా బుద్ధి చెబుతారని అన్నారు.

# మార్చి 5 ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పరీక్షలు

**ఫిబ్రవరి 22న పూర్తి కానున్న ప్రాక్టికల్స్**

**వార్షిక పరీక్షల ఏర్పాట్లలో నిమగ్నమైన అధికారులు**



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణ ఇంటర్మీడియట్ పరీక్షలు మార్చి 5వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఫిబ్రవరి 22వ తేదీతో అన్ని పరీక్షలు ప్రాక్టికల్స్ పూర్తి కానున్నాయి. అయితే వార్షిక పరీక్షలకు సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇంటర్ పరీక్షల నేపథ్యంలో అన్ని జిల్లాల డీఈవోలు, నోడల్ అధికారులతో ఇంటర్ బోర్డు కార్యదర్శి మంగళవారం సమీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణపై చర్చించారు. పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద కఠినమైన నిఘా ఉంచేలా జిల్లాల వారీగా కస్టోడియన్, డిపార్ట్‌మెంటల్ అధికారులను నియమించాలని స్పష్టం చేశారు. అనుభవజ్ఞులైన సిబ్బందిని పరీక్షల నిర్వహణకు వినియోగించుకోవాలి. ప్రతి పరీక్షా కేంద్రం సీసీటీవీ పర్యవేక్షణలో ఉండాలి. పరీక్షా సిబ్బంది వివరాల్లో ఎలాంటి పొరపాట్లు లేకుండా కచ్చితమైన పరిశీలన జరపాలి. ప్రశ్నాపత్రాల భద్రతా ఏర్పాట్లు, సిబ్బంది వివరాలను పూర్తిగా పరిశీలించాలి. ఏర్పాట్ల పర్యవేక్షణకు త్వరలోనే జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించనున్నారు అని ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య చెప్పారు.

## ఇంటర్ ఫస్టియర్ ఎగ్జామ్స్ షెడ్యూల్

మార్చి 5, 2025 (బుధవారం)- సెకండ్ లాంగ్వేజ్ పేపర్-1.

మార్చి 7, 2025 (శుక్రవారం)- ఇంగ్లీష్ పేపర్-1.

మార్చి 11, 2025 (మంగళవారం) - మ్యాథ్స్ పేపర్-1ఏ, బోటనీ పేపర్-1, పొలిటికల్ సైన్స్ పేపర్-1.

మార్చి 13, 2025 (గురువారం)-మ్యాథ్స్ పేపర్-1బి, జువాలజీ పేపర్-1, హిస్టరీ పేపర్-1.

మార్చి 17, 2025 (సోమవారం) -ఫిజిక్స్ పేపర్-1, ఎనకామిక్స్ పేపర్-1.

మార్చి 19, 2025 (బుధవారం) -కెమిస్ట్రీ పేపర్-1, కామర్స్ పేపర్-1.

మార్చి 21,2025 (శుక్రవారం)-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-1, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్య పేపర్-1 (బైపీసీ విద్యార్థులకు)

మార్చి 24, 2025 (సోమవారం)-మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-1, జాగ్రఫీ పేపర్ -1.

ఇంటర్ సెకండియర్ ఎగ్జామ్స్ షెడ్యూల్:

మార్చి 6 , 2025 (గురువారం)- సెకండ్ లాంగ్వేజ్ పేపర్-2.

మార్చి 10, 2025 (సోమవారం)- ఇంగ్లీష్ పేపర్-2.

మార్చి 12, 2025(బుధవారం) -మ్యాథ్స్ పేపర్-2ఏ, బోటనీ పేపర్-2, పొలిటికల్ సైన్స్ పేపర్-2.

మార్చి 15, 2025 (శనివారం)-మ్యాథ్స్ పేపర్-2బి, జువాలజీ పేపర్-2, హిస్టరీ పేపర్-2.

మార్చి 18, 2025 (మంగళవారం) - ఫిజిక్స్ పేపర్-2, ఎనకామిక్స్ పేపర్-2.

మార్చి 20, 2025(గురువారం) -కెమిస్ట్రీ పేపర్-2, కామర్స్ పేపర్-2.

మార్చి 22,2025 (శనివారం)-పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ పేపర్-2, బ్రిడ్జ్ కోర్స్ మ్యాథ్య పేపర్-2 (బైపీసీ విద్యార్థులకు)

మార్చి 25, 2025 (మంగళవారం)- మోడ్రన్ లాంగ్వేజ్ పేపర్-2, జాగ్రఫీ పేపర్ -2.

# అనూహ్యంగా పెరిగిపోతున్న విద్యుత్తు డిమాండ్



మొదటి పేజీ తరువాయి

దాటేసింది. బుధవారం ఉదయం 07:55 కు 16058 మెగావాట్ల అత్యధిక విద్యుత్ డిమాండు నమోదైంది. గత ఏడాది ఇదే నెల 10న నమోదయిన 15998 మెగావాట్ల డిమాండ్ ను అధిగమించడం జరిగింది. గతేడాది మార్చి 8న నమోదయిన అత్యధిక విద్యుత్ డిమాండు 15623 మెగావాట్లు కాగా దీన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 5 న విద్యుత్ సంస్థలు అధిగమించాయి. అనూహ్యంగా పెరుగుతున్న విద్యుత్తు డిమాండు నేపథ్యంలో డిప్యూటీ సీఎం, విద్యుత్తు శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క విద్యుత్ సంస్థల సీఎండీ లతో సరఫరా పరిస్థితిని సమీక్షించారు. ఈ ఏడాదిలో భారీ స్థాయిలో నమోదవుతున్న విద్యుత్ డిమాండును ఎలాంటి సమస్యలు లేకుండా విద్యుత్ సంస్థలు దీటుగా ఎదుర్కొంటుండటాన్ని అభినందించారు. డిమాండు ఎంతగా పెరిగినా దానికి తగ్గట్టు విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం సిద్ధంగా ఉందనిభట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఈ ఏడాది వేసవి ఎండల తీవ్రత ముందుగానే పెరిగిపోవడం భూగర్భ జలాల వినియోగం పెరుగుతుండటం జలవనరుల్లో నీటి నిల్వలు వేగంగా తరిగిపోతున్న నేపథ్యంలో విద్యుత్తు డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోతుంది. గత ఏడాది విద్యుత్తు వినియోగ రికార్డులన్ని ఫిబ్రవరి మాసంలో అధిగమించిన తీరు చూస్తే మునుముందు విద్యుత్తు వినియోగ డిమాండ్ మరిన్ని కొత్త రికార్డులు సృష్టిస్తుందని విద్యుత్తు రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# ఐదు రాష్ట్రాలకు కేంద్ర విపత్తు సాయం



తెలంగాణ బ్యూరో, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో భారీ వర్షాలు, భూకంపాలు, వరదలు ఇతర ప్రకృతి విపత్తుల వల్ల తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్న ఐదు రాష్ట్రాలకు కేంద్రం బుధవారం విపత్తు సాయం నిధులు విడుదల చేసింది. మొత్తం ఐదు రాష్ట్రాల కు కలిపి విపత్తు, వరద సాయం రూ. 1,554.99 కోట్లను కేంద్ర రిలీజ్ చేసింది. ఇందులో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, నాగాలాండ్, ఒడిస్సా, త్రిపుర రాష్ట్రాలకు వరద సాయం పొందనున్నాయి. ఈ రోజు విడుదలైన మొత్తంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పెద్ద ఎత్తున నిధులను కేంద్ర విడుదల చేసింది. ఏపీకి రూ. 608.08 కోట్లు కేటాయించగా, తెలంగాణకు రూ. 231.75 కోట్లు, నాగాలాండ్‌కు రూ. 170.99 కోట్లు, ఒరిస్సాకు రూ. 255.24 కోట్లు, త్రిపురకు రూ. 288.93 కోట్ల నిధులను కేంద్రం రిలీజ్ చేసింది. కాగా కేంద్రం విడుదల చేసిన ఈ విపత్తు సాయం నిధులపై కేంద్ర మంత్రి బండి సంజయ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన తన ట్విట్టర్‌లో ఇలా రాసుకొచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దార్శనికతకు అద్దంపడుతూ భారతదేశం ప్రకృతి విపత్తులను తట్టుకునేలా అడుగులు వేస్తున్న కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా కు యావత్ భారత ప్రజల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, నాగాలాండ్, త్రిపుర రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం రూ.1554.99 కోట్ల అదనపు సాయం చేయడం వల్ల విపత్తు నిర్వహణ మరింత బలోపేతం కానుంది. విపత్తు ప్రమాదాలను తగ్గించడం, విపత్తులకు సంసిద్ధంగా ఉండటం, మరణాలను నివారించడం తో పాటు జీవితాలను, జీవనోపాధిని రక్షించడానికి జరుగుతున్న ప్రయత్నాలకు మరింత బలం చేకూరుతుంది. అని కేంద్ర మంత్రి బండి సంజయ్ రాసుకొచ్చారు.

# హైదరాబాద్- విజయవాడ సర్వీస్‌లో ప్రత్యేక రాయితీ

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): హైదరాబాద్- విజయవాడ మార్గంలో ప్రయాణించే వారి కోసం టీజీఆర్టీసీ ప్రత్యేక రాయితీలను యాజమాన్యం ప్రకటించింది. ఈ విషయాన్ని టీజీఆర్టీసీ ఎండీ, సీనియర్ ఐపీఎస్ వీ.సీ.సజ్జనార్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. లహరి- నాన్ ఏసీ స్లీపర్ కమ్ సీటర్, సూపర్ లగ్జరీ సర్వీసుల్లో 10 శాతం, రాజధాని ఏసీ బస్సుల్లో 8 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్లు వెల్లడించారు. ఈ డిస్కౌంట్ సదుపాయాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని సంస్థ కోరుతోందని తెలిపారు. జీఎస్ఆర్టీసీ బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్ కోసం %ట్ట్రజూం:₹//స్త్రంతీఏఎబం.ఱఅ% అధికారిక వెబ్‌సైట్‌ని సందర్శించాలని సూచించారు. ఇప్పటికే మహా శివరాత్రి సందర్భంగా ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీసులు ఏర్పాట్ల పై నిర్ణయం తీసుకుంది. మహా శివరాత్రి సందర్భంగా భక్తులు అధికంగా వెళ్ళే వేములవాడ, శ్రీశైలం, ఏడుపాయల, కీసర పాలకుర్తి దేవాలయాలకు వెళ్ళే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడిపించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశించారు. గత సంవత్సరం కంటే భక్తులు అధికంగా వచ్చే అవకాశం ఉన్నందునా అదనపు బస్సులు నడిపేలా ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. బస్ స్టాండ్ ల వద్ద అధిక రద్దీ ఉన్నప్పుడు ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఆర్టీసీ ప్రత్యేక అధికారులను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చారు.

# ప్రతిష్టాత్మక కార్యక్రమానికి వేదికకానున్న హైదరాబాద్

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): మరో ప్రతిష్టాత్మక కార్యక్రమానికి హైదరాబాద్ వేదిక కానుంది. ప్రపంచ వ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే మిస్ వరల్డ్ పోటీల ను హైదరాబాద్ వేదికగా నిర్వహించేందుకు ప్రణాళిక సిద్ధం అయింది. ఈ మేరకు బుధవారం మిస్ వరల్డ్ పోటీల నిర్వహాకులు షెడ్యూల్ విడుదల చేశారు. ఈ పోటీలు మే 7 నుంచి 31 వరకు తెలంగాణలోని హైదరాబాద్ వేదికగా నిర్వహించనున్నారు. హైదరాబాద్‌లో ఈ మిస్ వరల్డ్ ప్రారంభ, ముగింపు వేడుకలు జరగనున్నాయి. ఈ మిస్ వరల్డ్ పోటీలకు 120 దేశాల నుంచి యువతులు పాల్గొననున్నారు. కాగా ఈ ప్రపంచ సుందరి అందాల పోటీలు 28 సంవత్సరాల తర్వాత భారత్‌లో జరగనున్నాయి. ఈ మిస్ వరల్డ్ పోటీలను 1951లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో ఎరిక్ మోర్లీ స్థాపించారు. దశాబ్దాలుగా ఈ ఐకానిక్ పోటీలు ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో జరుగుతున్నాయి. ఈ ఫెస్టివల్ బికినీ కాంటెస్ట్ అని పిలిచే ఈ ఈవెంట్ బ్రిటిష్ ప్రెస్ ప్రచార బాధ్యతలు నిర్వహించింది. మిస్ వరల్డ్ పోటీలు మొదటి సారి నిర్వహించినప్పుడు స్వీడన్‌కు చెందిన కెర్‌స్టిన్ "కికీ" హకాన్సన్ మొదటి మిస్ వరల్డ్‌గా నిలిచింది. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ వార్షిక మిస్ వరల్డ్ ఫైనల్స్‌ను పర్యవేక్షించే బాధ్యత కలిగిన ఉండటంతో ఈ పోటీని ప్రపంచంలోనే అతిపెద్ద ఈవెంట్‌గా మార్చింది. ఈ సంస్థ వికలాంగులు వెనుకబడిన పిల్లలకు సహాయం చేసేందుకు స్వచ్ఛంద సంస్థల నుంచి విరాళాలు సేకరించి 100 కంటే ఎక్కువ దేశాలలో సేవలు అందిస్తుంది. ఇదిలా ఉంటే భారతదేశంలో చివరిగా 1996లో మిస్ వరల్డ్ పోటీకి ఆతిథ్యం ఇచ్చింది. తిరిగి మూడు దశబ్దాల తర్వాత ఈ పోటీని భారతదేశంలో అది కూడా తెలంగాణలోని హైదరాబాద్ లో నిర్వహించనుంది. అయితే మొదట ఢిల్లీలో ఈ పోటీలు నిర్వహించాలని నిర్ణయించగా తాజాగా ఈ మిస్ వరల్డ్ పోటీల హైదరాబాద్ లో నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

# మాజీ సీఎం కేసీఆర్ వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి ఫైర్



మొదటి పేజీ తరువాయి

వ్యతిరేకత ఉందని త్వరలో ఉప ఎన్నికలు రాబోతున్నాయని, ఆ ఉప ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధిస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రాష్ట్రం వెనక్కిపోతుందని, ఆ పార్టీ పాలనపై ప్రజలు తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారని అన్నారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ స్థాపించి 25 సంవత్సరాలు కావస్తుండటంతో సంవత్సరం పాటు సిల్వర్ జూబ్లీ సెలబ్రేషన్స్ చేయాలని నిర్ణయించారు. అయితే కాంగ్రెస్ పార్టీ పై మాజీ సీఎం కేసీఆర్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఫైర్ అయ్యారు. రాష్ట్రంలో తిరిగి అధికారంలోకి వస్తామని కేసీఆర్ పగటికలలు కంటున్నారని ఆయన విమర్శించారు. అలాగే 14 నెలల నుంచి అజ్ఞాతంలో ఉన్న కేసీఆర్ కు రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఎలా కనబడుతుందని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. కేసీఆర్ ఒక సీజనల్ పొలిటీషియన్ అని ఎన్నికలప్పుడు మాత్రమే ఆయనకు ప్రజలు గుర్తుకొస్తారని 14 నెలల నుంచి ఫాంహౌస్ దాటని ఆయన స్థానిక ఎన్నికలు వస్తున్నాయని ప్రజల్లోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొంగులేటి విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. శాసనసభలో కీలకమైన తీర్మానాలు, కులగణన, ఎస్సీవర్గీకరణ, భూభారతి బిల్లు, తెలంగాణ ఏర్పాటులో కీలక భూమిక పోషించిన మన్మోహన్ సింగ్ సంతాప తీర్మానానికి కూడా కేసీఆర్ హాజరుకాలేదని తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణకు సైతం గైర్హాజరయ్యారయ్యాని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. కేసీఆర్ అసెంబ్లీకి వస్తే ఆయన పదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని ఏవిధంగా తిరోగమనదిశలోకి తీసుకెళ్లారు, పదేళ్లలో ఆయన చేసిన నిర్వాకాలను తప్పులను ఒక్కొక్కటిగా సరిచేసుకుంటూ 14నెలల్లో తాము సాధించిన అభివృద్దిని సవివరంగా కేసీఆర్ ముందుంచుతామని అన్నారు. కాంగ్రెస్ భవిష్యత్ గురించి కాకుండా ముందుగా కేసీఆర్ తన భవిష్యత్తు, తన పార్టీ భవిష్యత్తు గురించి ఆలోచిస్తే బాగుంటుందని ఈ సందర్భంగా సూచించారు. అలాగే కేసీఆర్ భవిష్యత్తుపై గత పార్లమెంటు ఎన్నికల్లో ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారు. పార్లమెంటు తీర్పే భవిష్యత్తులో ఉంటుంది. నువ్వు వద్దు, నీ పాలన వద్దూ మహాప్రభో అని తెలంగాణ ప్రజలు వదిలించుకున్నా ఇంకా వదిలేది లేదన్నట్లుగా కేసీఆర్ వ్యవహారం ఉందని మంత్రి తన ప్రకటనలో చెప్పుకొచ్చారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్

పార్థివదేహానికి పూలమాలవేసి నివాలులు అర్పించిన నాయకులు



వెంకటాపూర్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): తెలంగాణా రాష్ట్ర పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ-శిశు, సంక్షేమశాఖ మంత్రి డా. దనసరి అనసూయ (సీతక్క) ఆదేశాలమేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు బైరెడ్డి భగవాన్ రెడ్డిల సూచనలమేరకు ఈరోజు వెంకటాపూర్ (రామప్ప) మండలంలోని ఆనందపూర్ గ్రామంలోని కాంగ్రెస్ యూత్ నాయకులు పుట్ట రాజు అమ్మ పుట్ట సరోజన మరణించగా,ఇట్టి కార్యక్రమానికి హాజరై వారి పార్థివదేహానికి పూలమాలవేసి, నివాలులు అర్పించిన వెంకటాపూర్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బండి శ్రీనివాస్ వారితోపాటు ఈ కార్యక్రమంలో భాగంగా, జిల్లా కార్యవర్గ సభ్యులు సామల జయపాల్ రెడ్డి,గ్రామకమిటి అధ్యక్షులు సాగర్, మాజీ సర్పంచ్- మేకల రాజమొగిలి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఈర్ల కవిరాజు, బూర్గుపేట మాజీ 1వార్డు మెంబర్-సారంగపాణి, గ్రామయూత్ ఉపాధ్యక్షులు సతీష్, కులపెద్దమనిషి చాతరాజు.రవి, రాజిరెడ్డి, రమేష్ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

## రోజూ వారి మెనూని పక్కాగా అమలు చేయాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్





జనగామ జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): విద్యార్థులకు అందించే ఆహారం పట్ల రోజూ వారి మెనూని పక్కాగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం, జిల్లాలోని చిల్పూర్ మండలంలోని రాజవరం గ్రామ పంచాయతీలో గల కేజీబీవీ పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) రోహిత్ సింగ్ సందర్శించి, పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేస్తూ ముచ్చటించారు. ఎక్కడ నుంచి వచ్చారు.. ఎలా చదువుతున్నారు.. ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని సమయానికి అందిస్తున్నారా.. వంటి వివరాలను అడిగి తెలుసుకుంటూ, చక్కగా చదువుకొని ఉన్నత విలువలతో వృద్ధిలోకి రావాలని మార్గనిర్దేశం చేశారు. అలాగే ప్రతిరోజూ సరుకుల నాణ్యతను నిశితంగా పరిశీలించాలని, పరిశుభ్రమైన వాతావరణంలో భోజనం తయారు చేయాలని, నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా అనుసరించాలని, సమయానుగుణంగా రుచికరమైన పోషకాహారాన్ని విద్యార్థులకు ఇవ్వాలని, ఉపాధ్యాయులు, సిబ్బంది హాజరు రిజిస్టర్ లను తనిఖీ చేసి, సమయపాలన ఖచ్చితంగా పాటించాలని సూచించారు. అదే విధంగా అదే మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతు భరోసా పథకం కింద యోగ్యం కాని వ్యవసాయ భూములను జాబితాలో ఎలాంటి తప్పులు దొర్లకుండా సరైన విధంగా గుర్తించాలని సూచించారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ వెంట తహసీల్దార్ సరస్వతి, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

### జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



జనగామ జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ హెచ్చరించారు. బుధవారం, జిల్లాలోని యశ్వంతాపూర్ వాగును డీసీపీ రాజ మహేంద్ర నాయక్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి, ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్రమ ఇసుక రవాణాను ఉపేక్షించేది లేదన్నారు. ఇసుక, వాగుల్లోని ఒండ్రుమట్టి తరలింపును అరికట్టేందుకు వాగుల్లోకి వెళ్ళేదారుల్లో ట్రెంచ్ లు తవ్వి ట్రాక్టర్లు వెళ్లకుండా కట్టడి చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. రఘునాథపల్లి మండలం, కోమల్ల టోల్ గేట్ పరిధిలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టును పరిశీలించి, కట్టుదిట్టమైన నిఘాతో నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. అనంతరం రఘునాథపల్లి మండలంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి, పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించి, పెండింగ్ లో ఉన్న దరఖాస్తు లను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట ఆర్డీఓ గోపీరాం, తహసీల్దార్ మోసిన్, ఇతర సంబంధిత అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# పీఎంశ్రీ పాఠశాలల్లో స్వీయ రక్షణ శిక్షణ కార్యక్రమాలు

### హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య



హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో విద్యార్థినులకు స్వీయ రక్షణకు సంబంధించి కరాటే, తదితర మార్షల్ ఆర్ట్స్ లో శిక్షణ కార్యక్రమాల నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య అన్నారు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగరలోని డాక్టర్ పీవీ రంగారావు తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో హాస్టల్ నిద్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం రాత్రి బస చేయగా బుధవారం ఉదయం ఐదు గంటల నుండి మొదలైన విద్యార్థినుల దైనందిన కార్యక్రమాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులు ఉదయం వేళ వ్యాయామం, యోగా చేయగా కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థినులతో కలిసి కలెక్టర్ డైనింగ్ హాలులో అల్పాహారాన్ని తీసుకున్నారు. విద్యార్థినులతో కలిసి అసెంబ్లీ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం వారిని ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాల వాతావరణం చాలా బాగుందని పేర్కొన్నారు. పాఠశాలలో కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి పాఠశాలకు, కళాశాలకు అదేవిధంగా జిల్లాకు మంచి పేరుని తీసుకురావాలని ఆకాంక్షించారు. చదువుల్లోనూ, క్రీడల్లోనూ రాణించి మంచి పేరును తీసుకువస్తారని నమ్మకం ఉందన్నారు. పాఠశాలకు కావలసిన అన్ని మౌలిక వసతులను సమకూర్చుతున్నట్లు తెలిపారు. స్కూల్, క్లాస్ లీడర్ విద్యార్థినులు బ్యాడ్జీలను ధరించి హుందాగా వ్యవహరిస్తూ తమ బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. విద్యార్థినులందరూ మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులందరికీ ఆల్ ది బెస్ట్ తెలియజేశారు. పదో తరగతి విద్యార్థినులకు పరీక్ష ప్యాడ్లు, నోట్ బుక్స్ కలెక్టర్ అందజేశారు. అనంతరం మీడియాతో కలెక్టర్ ప్రావిణ్య మాట్లాడుతూ గురుకుల పాఠశాల కళాశాలలో 95 శాతం వరకు వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన పనులు పూర్తయినట్లు పేర్కొన్నారు. పది రోజుల్లో మిగతా పనులను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం కూడా పాఠశాలలో వసతులను గురించి విద్యార్థినులతో కూడా మాట్లాడినట్లు పేర్కొన్నారు. విద్యార్థినులు అడిగిన విధంగా త్వరలోనే పాఠశాలకు మిషన్ భగీరథ నీటిని అందించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినులకు పీఎం శ్రీ పథకంలో భాగంగా స్వీయ రక్షణ కార్యక్రమాలలో తర్ఫీదునిస్తున్నట్లు తెలిపారు. పీఎం శ్రీ పథకం కింద నిర్వహిస్తున్న స్వీయ రక్షణ కార్యక్రమంలో విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొంటున్నారని పేర్కొన్నారు. స్వీయ రక్షణ కార్యక్రమంలో పాల్గొంటుండడం ద్వారా విద్యార్థినులలో మనోధైర్యం పెంపొందడంతోపాటు వ్యక్తిత్వ వికాసం కలుగుతుందన్నారు. మెనూ ప్రకారం డైట్ ను అందిస్తున్నారా లేదా అని పరిశీలించినట్లు తెలిపారు. విద్యార్థినులకు అందిస్తున్న భోజనాన్ని పరిశీలించి వారితో మాట్లాడి అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. హాస్టల్లో అల్పాహారం, భోజనం, సౌకర్యాలు బాగున్నాయని చెప్పారు. హాస్టల్ లో ఎలాంటి ఇబ్బందులు లేవన్నారు. కాస్మోటిక్ చార్జీలను అందిస్తున్నారా లేదా అని విద్యార్థినులను అడిగి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ గురుకుల పాఠశాల పీఎం శ్రీ పథకం కింద ఉండడంతో గ్రంథాలయాన్ని ఏర్పాటు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురానున్నట్లు తెలిపారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గురుకుల పాఠశాలలో ఉదయం, సాయంత్రం పూటల్లో ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జూనియర్ కళాశాల విద్యార్థినిలకు జేఈఈ, నీట్ తదితర పోటీ పరీక్షల నిర్వహించి మంచి మార్కులు సాధించేలా కృషి చేయాలని ప్రిన్సిపల్, అధ్యాపకులకు సూచించారు. క్రీడలలో రాణించే విధంగా అనేక క్రీడా పరికరాలు ఉన్నాయని, అదేవిధంగా కిచెన్ గార్డెన్ బాగుందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓ సునీత రాణి, ప్రిన్సిపల్ అఫ్రీన్ సుల్తానా, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వేసవిలో మంచినీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలి

### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): వేసవిలో మంచినీరు, నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని, అలాగే నిరంతరాయ విద్యుత్ సరఫరా కోసం అవసరమైన ఏర్పాట్లు చేయు చర్యలపై బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మిషన్ భగీరథ, విద్యుత్, ఎంపిడిఓలు, ఎంపిఓలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా మంచినీటి సరఫరా పరిస్థితిని ఎంపిడివోలు, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. మిషన్ భగీరథ పైపులైన్లను క్రమం తప్పకుండా పరిశీలించి, ఎక్కడైనా మరమ్మతుల అవసరం ఉంటే వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గ్రామ, పట్టణాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నా ప్రత్యామ్నయంగా సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. విద్యుత్ సమస్య వస్తే రాష్ట్ర స్థాయిలో ఏర్పాటు చేసిన 1912 కాల్ సెంటర్ కు ఫోన్ చేయాలని, అట్టి ఫిర్యాదు జిల్లాకు చేరుతుందని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ రాహుల్ శర్మ స్పష్టం చేశారు. ఫీడర్ వారిగా విద్యుత్ వినియోగం వివరాలు నమోదు చేయాలని సూచించారు. వేసవి ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. గత సంవత్సరంలో సమస్య వచ్చిన గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. ఎక్కడైనా మంచినీటి సమస్య వస్తే ప్రత్యామ్నయంగా ట్యాంకర్ల ద్వారా మంచినీటిని సరఫరా చేయాలని తెలిపారు. మంచినీటి వృధాను అరికట్టేందుకు సమయ పాలన పాటించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ సీఈ మల్చూర్ నాయక్, ఆర్ డబ్ల్యూ ఎస్ ఈ ఈ నిర్మల, డిపిఓ నారాయణ రావు, అన్ని మండలాల ఎంపీడీఓలు, విద్యుత్, మిషన్ భగీరథ ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ. బుధవారం రేగొండ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్మిస్తున్న ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనులను 45 రోజుల్లో పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి, పనుల పురోగతిని అంచనా వేశారు. ఇంటి నిర్మాణంలో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇందిరమ్మ మోడల్ హౌసింగ్ పథకం ద్వారా పేదలకు మంచి గృహాలు అందించడమే లక్ష్యమని తెలిపారు. పనుల్లో ఆలస్యం లేకుండా, నాణ్యతతో కూడిన నిర్మాణం జరగాలని అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, డిఆర్డీఓ నరేష్, తహసీల్దార్ శ్వేతా, ఎంపిడిఓ వెంకటేశ్వ రావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ రాయలింగు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలి



### జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): మహా శివరాత్రి వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. బుధవారం ఐడిఓసి కార్యాలయంలో మహాశివరాత్రి వేడుకలపై దేవాదాయ, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య, ఇరిగేషన్, మత్స్య, విద్యుత్, ఆబ్కారీ, సింగరేణి, ఆర్టీసీ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీన కాళేశ్వర శ్రీ ముక్తేశ్వర స్వామి దేవాలయంలో జరిగే మహా శివరాత్రి వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉన్నదని అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మహా శివరాత్రి సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు దేవాలయాలను దర్శించుకునే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, పరిశుభ్రమైన త్రాగునీటి సరఫరా, వైద్యం, భద్రతా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు సూచించారు. భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఆలయ ప్రాంగణాల్లో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా నిర్వహించాలని పేర్కొన్నారు. కుంభాభి షేకం మహోత్సవాల్లో పారిశుధ్య కార్యక్రమాలు బాగా చేశారని సంబంధిత శాఖల అధికారులను, సిబ్బందిని అభినందించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని, అత్యవసర సేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. భక్తులు గోదావరిలోకి వెళ్లకుండా నియంత్రణ చేయాలని, ప్రమాద హెచ్చరికల బోర్డులు ఏర్పాటు చేయాలని, అలాగే గజ ఈతగాళ్ళు ను అందుబాటులో ఉంచాలని సూచించారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున మన డిపో నుండే కాకుండా ఇతర డిపోల నుండి అధికంగా బస్సులు నడపాలని డిఎం కు సూచించారు. సింగరేణి సంస్థ ద్వారా రెస్క్యూ టీము ఏర్పాటు చేయాలని తెలిపారు. పండుగ రోజుల్లో 48 గంటలు మద్యం విక్రయాలు నిలుపుదల చేయాలని, పటిష్ట పర్యవేక్షణ చేయాలని ఆబ్కారీ అధికారు లను ఆదేశించారు. తాత్కాలిక. మరుగుదొడ్లు, భక్తులు బట్టలు మార్చుకునే గదులు ఏర్పాటు చేయాలని ఇరిగేషన్ అధికారు లను ఆదేశించారు. అభిషేకం దర్శన సమయంలో భక్తులు క్రమ పద్ధతి పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. దేవాలయాన్ని విద్యుద్దీకరణ, పూలతో ముస్తాబు చేయాలని దేవస్థానం అధికారులకు సూచించారు. వాహనాలు క్రమబద్దీకరణకు పార్కింగ్ స్థలం ఏర్పాటు చేసి నిర్దేశించిన ప్రాంతంలో భక్తులు వాహనాలు నిలుపుదల చేయు విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పటిష్ట పోలిస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులకు సూచించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. అనంతరం మహా శివరాత్రి గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డిపిఓ నారాయణ రావు, విద్యుత్ శాఖ ఎస్ ఈ మల్చూర్ నాయక్, మత్స్య శాఖ అధికారి అవినాష్, దేవస్థానం ఈఓ మహేష్ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## సీఎం రెవంత్ రెడ్డికి ఉత్తరాలు రాసిన తెలంగాణ ఉద్యమకారుల





జగిత్యాల, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): పోస్ట్ కార్డు ఉద్యమం జగిత్యాల జిల్లా కేంద్రంలోని పోస్ట్ ఆఫీస్ బాక్స్ వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పోస్ట్ కార్డు ద్వారా ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జగిత్యాల జిల్లా ఉద్యమకారుల ఫోరం చేర్మెన్ జవ్వాజి శంకర్ ఆధ్వర్యంలో పోస్ట్ కార్డులు వేయడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా చేర్మెన్ జవ్వాజి శంకర్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారులకు ఇస్తన న్న 250 గజాల ఇట్టి స్థలం, ఇంటి నిర్మాణానికి అయ్యే ఖర్చు పెన్షన్ 25000 రూపాయలు గుర్తింపు కార్డులు బస్ పాస్,రైల్ పాసు, హామీలను వెంటనే నెరవేర్చాలని అన్నారు, ఈ కార్యక్రమలో వైస్ చైర్మన్ రగుల రాజు ప్రధాన కార్యదర్శి భరతపు లింగారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గం కన్వీనర్ కొండ్రా ప్రేమ్ కుమార్ కళాకారుల ప్రధాన కార్యదర్శి మల్యాల సతీష్ కార్యదర్శ ఉమేందర్ రాకేష్ పరకాల వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి వేడుకలు

సూర్యాపేట ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): హిందూ సామ్రాట్ చత్రపతి శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నేరేడుచర్ల మండల కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. నిర్వాహకులు కాల్వ సైదులు, సరికొప్పుల నాగేశ్వరరావు, కొణతం నాగిరెడ్డి, జింకల భాస్కర్, దేవిరెడ్డి నాగిరెడ్డి ల ఆధ్వర్యంలో చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి కొబ్బరికాయ కొట్టి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చత్రపతి శివాజీ పేరు భారతదేశ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన గొప్ప పేరు అని ఈ పేరు వింటేనే భరతావణి పులకించిపోతుందన్నారు.మొగలుల దాడుల నుంచి హిందూ మతాన్ని రక్షించిన ఘనత ఆ మరాఠ యోధుడికే దక్కుతుందన్నారు. యుద్ధంలో గెలుపు తప్ప ఓటమి ఎరగని యోధుడు అని కొనియాడారు.స్వతంత్ర మరాఠా సామ్రాజ్యాన్ని నెలకొల్పి, మధ్యయుగంలో హిందూ మతధర్మాన్ని పరిరక్షించిన ఘనత శివాజీకే దక్కుతుందనడంలో అతిశయోక్తిలేదని అన్ని మతాలను గౌరవించి, ఆదరించాడన్నారు. యువత ఆయన స్ఫూర్తితో ఆశయ సాధనకు కృషి చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఛత్రపతి శివాజి సైన్యం రాము, బైరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎడవల్లి అరుణ్, అనిల్ కుమార్, వెంకటేశ్వర్లు, సంకలమద్ది మధు, చారగుండ్ల సైదులు, శేఖర్, తాళాల రమేష్, మెట్టు మధు, మెట్టు శ్రీను, కదారి ఎల్లయ్య, ఉప్పల్లి ప్రవీణ్, పల్లెపంగు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.



# మహా శివరాత్రి మహోత్సవములు విజయవంతం చేయాలి

**ఆధ్యాత్మిక శోభతో ఘనంగా నిర్వహించాలి**

**ఈ నెల 26 నుంచి ఫిబ్రవరి 28 వరకు జాతర నిర్వహణ**

**భక్తుల నుంచి ఫిర్యాదు రాకుండా ఏర్పాట్లు చేయాలి**

**అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు**



ములుగు జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): అన్ని శాఖల అధికారులు సమన్వయంతో మహా శివరాత్రి మహోత్సవములు విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు ఎం. సంపత్ రావు ఆదేశించారు. బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా డిఎస్పీ రవీందర్, ఆర్డీఓ వెంకటేష్, రామప్ప శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయ ఈవో, ఆయా శాఖల అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు
ఎం. సంపత్ రావు జాతర సమన్వయ సమావేశం నిర్వహించారు. మహా శివరాత్రి జాతర సందర్భంగా అదనపు బస్సులు, పారిశుద్ధ్యం, పార్కింగ్, రోడ్డు నిర్వహణ, దేవాలయం వద్ద వసతి సౌకర్యం, త్రాగునీటి సరఫరా, హెల్త్ క్యాంప్ ల ఏర్పాటు, ఫైర్ ఇంజన్ సౌకర్యం, హెల్ప్ సెంటర్ ఏర్పాటు సాంస్కృతిక కార్యక్రమాలు తదితర అంశాల పై సంబంధిత శాఖ అధికారులు సిద్ధం చేసుకున్న ప్రణాళికను వివరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26నుంచి 28వ తేదీ వరకు మహా శివరాత్రి మహోత్సవ వేడుకలను వైభవోపేతంగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కల్గకుండా జాతర నిర్వహించాల్సి ఉంటుందని, నిర్దేశించుకున్న పనులను జాతర సమయానికి సన్నద్ధమయ్యే విధంగా వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. జాతరకు వచ్చే భక్తుల సంఖ్య దృష్ట్యా పటిష్ట భద్రత వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని, రామప్పకు వచ్చే అన్ని రోడ్లలో ఉన్న గుంతలను వెంటనే పూడ్చి వేయాలని రోడ్డుకు ఇరు వైపులా పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. భక్తుల కోసం అవసరమైన మేర పందిర్లు ఏర్పాటు చేయాలని అన్నారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా ఎక్కడికక్కడ చలి వేంద్రాలను, చలువ పందిరిలు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆలయ పరిసరాలలో అపరిశుభ్రత కాకుండా పారిశుధ్య సిబ్బంది విధులు నిర్వహించాలని పేర్కొన్నారు.
జాతర సందర్భంగా వైద్య క్యాంపులు ఏర్పాటు చేయాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ముఖ్యమైన ప్రదేశాలలో అన్ని పందిళ్ళ వద్ద మంటలు ఆర్పే ఫైర్ యంత్రాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో సంబంధిత జిల్లా అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలి

**విద్యతోనే భవిష్యత్తు బాగుంటుంది**

**పాఠశాల ఆకస్మిక తనిఖీలో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బుధవారం లక్ష్మీదేవి పల్లి మండలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ తనిఖీలో భాగంగా పాఠశాలలోని పదవ తరగతి గదిలో విద్యార్థులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కృషి,పట్టుదల క్రమశిక్షణతో పదవ తరగతిలో విజయం సాధించి భవిష్యత్తులో ఏం చదవాలి అనే లక్ష్యాన్ని ఏర్పరచుకొని ఆ దిశగా ముందుకు వెళ్లాలని విద్యార్థులకు సూచించారు.తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టు కుని తమ పిల్లలు బాగా చదవాలని పాఠశాలలకు పంపు తుంటారని విద్యార్థులు తమ తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చే విధంగా బాగా చదివి ఉన్నత శిఖరాలను అవరోధించాలన్నారు. భవిష్యత్తులో ఏమి చదువుతారని, ఏ గ్రూపు తీసుకుంటారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కష్టపడి చదివే విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. పరీక్షలకు కొన్ని రోజుల సమయం ఉన్నందున సమయాన్ని వృధా చేయకుండా చదవాలన్నారు. పరీక్ష సమయంలో ఒత్తిడికి గురి కాకుండా ఏదైనా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులు అడిగి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థి మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకొని 100 శాతం ఉత్తీర్ణత కు కృషి చేయాలని ఆదేశించారు. అనంతరం తొమ్మిదవ తరగతి గదిలో విద్యార్థులతో మమేకమై వారికి మెనూ ప్రకారం భోజనం అందుతుందా, ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారు అని ఆరా తీశారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టం (FRS) లో హాజరును ఎలా నమోదు చేస్తున్నారు అని అధికారులు అడిగి, ప్రతిరోజు నమోదు కచ్చితంగా చేయాలని, ఆపార్ నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. వంట గదిలో రాళ్ల పొయ్యి మీద వంట వండటానికి గమనించిన కలెక్టర్ రాళ్ళకు బదులు ఐరన్ తో చేసిన పొయ్యిలను ఉపయోగించాలని సూచించారు. పాఠశాల ఆవరణలో నాటిన మొక్కలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మునగ మరియు కరివేపాకు ను వంటలలో ఉపయోగిస్తున్నారా అని అధికారులను అడిగి, విద్యార్థులకు ఆహారంలో వీటిని ఉపయోగించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని కాబట్టి వంటలో ఉపయోగించాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది పాఠశాలలో సైన్స్ ల్యాబ్ నిర్మాణం మరియు రెండు బిల్డింగుల మధ్య రేకుల షెడ్డు నిర్మాణం ఆవశ్యకతను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక ఎంఈఓ ద్వారా సైన్స్ ల్యాబ్ మరియు రేకుల షెడ్డు నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొండలరావు, ఎంపీడీవో చలపతి, గ్రామ పంచాయతీ సెక్రెటరీ సాంబయ్య మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# నిరంతర విద్యుత్ అందించాలి

**త్రాగునీటి సరఫరా సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలి**

**ఎన్నికల కోడ్ ముగిశాక రేషన్ కార్డ్ ల పంపిణీ**

**ఎరువుల కొరత లేకుండా చూడాలి**

**అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలి**

**టెలి కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): అధికారులందరూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అంతరాయం లేకుండా విద్యుత్ నిరంతరంగా సరఫరా అయ్యేలా చూడాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లాలోని విద్యుత్, త్రాగునీరు, సాగునీరు, రేషన్ కార్డ్ దరఖాస్తుల పరిశీలన మరియు రైతు భరోసా దరఖాస్తుల నమోదు ప్రక్రియ ల పై అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్, స్థానిక సంస్థల అధనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి,, సంబంధిత జిల్లా అధికారులు, తాసిల్దారులు, ఎంపీడీవోలు, ఎంపీ ఓలు, ఎం ఏ ఓ లు, ఎంసీఎస్లు, డిఇలు మరియు మిషన్ భగీరథ మరియు విద్యుత్ శాఖ ఏఈలతో టెలికాన్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ మాట్లాడుతూ ప్రజల గృహ మరియు వాణిజ్య అవసరాలకు అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి విద్యుత్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఆటో జనరేటర్లు అందుబాటులో కు తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతు భరోసా దరఖాస్తుల ఆన్లైన్ ప్రక్రియలో భాగంగా పార్షియల్ సబ్ డివిజన్ మార్కింగ్ ఆప్షన్ అందుబాటులోకి వచ్చినందున తాసిల్దారులు మరియు మండల వ్యవసాయ అధికారులు తమ పరిధిలోని వ్యవసాయానికి యోగ్యం కానీ భూముల మార్కింగ్ ప్రక్రియను వారం రోజుల్లోగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలో యూరియా ఎంత అందుబాటులో ఉంది ఎంత అవసరం పడుతుందో తగిన నివేదికల సమర్పించాలని, రైతులకు తగినంత ఎరువులు అందుబాటులో దేల చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. జిల్లాలోని సాగు అవసరాలకు నీరు అందేలా ఇరిగేషన్, మండల వ్యవసాయ అధికారులు మరియు తాసిల్దార్లు సమన్వయంతో పర్యవేక్షించి చివరి రైతులకు కూడా సాగునీరు అందేలా చూడాలి అన్నారు. జిల్లాలో రైతు భరోసా ఫిర్యాదులపై సమగ్ర నివేదికలు మండల మరియు జిల్లాస్థాయిలో అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో త్రాగునీటి అవసరాలకు సరిపడా నీరు ఉందని కలెక్టర్ అన్నారు. త్రాగునీటి సరఫరా లో వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించడం ద్వారా వేసవిలో తాగునీటి సమస్యలు రాకుండా చూడాలని అన్నారు. మున్సిపల్ కమిషనర్లు మరియు పంచాయతీ సెక్రటరీలు ఏ వార్డులో ఏ పంచాయితీలో త్రాగునీటి సరఫరాకు సమస్యలు ఉన్నాయో గుర్తించి వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. త్రాగునీటి ట్యాంకులను ప్రతినెల రెండు సార్లు శుభ్రం చేసి బ్లీచింగ్ చల్లాలని ఆదేశించారు. ఎంపీడీవోలు ఎంపీలు తమ పరిధిలోని పాత మోటర్లు బాగు చేసి వాటిని అదనంగా అందుబాటులో ఉంచుకోవాలని, ప్రతి గ్రామంలో 10 శాతం మోటర్లు ఘనంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చేతిపంపులు ఎక్కడైతే రిపేరు ఉన్నాయో గుర్తించి వాటిని రిపేర్లను వెంటనే పూర్తి చేయాలని అన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నందున కొత్త రేషన్ కార్డ్ ల పంపిణీ ఎన్నికల అనంతరం చేపడతామని కలెక్టర్ అన్నారు. మీ సేవలో కొత్త రేషన్ కార్డుల కొరకు వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలన పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో సోలార్ పవర్ ప్లాంట్ ల స్థాపన కొరకు స్థల గుర్తింపును త్వరితగతిన పూర్తి చేయాలని కొత్తగూడెం మరియు భద్రాచలం ఆర్డీవో లను ఆదేశించారు.

# దళితులకు బహుజనులకు అన్యాయం చేస్తే మరో పోరాటం తప్పదు

**సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు**



సూర్యాపేట, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): దళితులు బహుజనులకు అన్యాయం చేస్తే మరో భూ పోరాటం తప్పదని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పారేపల్లి శేఖర్ రావు అన్నారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం ఫత్తె పురం గ్రామంలో దళితులకు బహుజనులకు గత 70 సంవత్సరాల క్రితం ఆనాటి సిపిఎం పార్టీ పోరాట ఫలితంగా ఇండ్ల స్థలాల కోసం పేదల సేద్యం కొరకు దానం చేసిన భూమిని తిరిగి బలవంతంగా తీసుకోవాలని చూడడం సరి సరైన పద్ధతి కాదని అన్నారు. బుధవారం పత్తేపురం గ్రామంలోని సర్వేనెంబర్ 258, 249 లో నిర్మించిన ఇండ్లను తిరిగి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ రెండు సర్వే నెంబర్లలో దళితులకు 150 మంది ఇండ్లు నిర్మించి 70 సంవత్సరాలు అవుతుందని గత ప్రభుత్వాలు అనగా 1986 సంవత్సరంలో తెలుగుదేశం ప్రభుత్వంలో 70 ఇండ్లు నిర్మించారని 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లను 80 నిర్మించి ఇచ్చారని అప్పటినుండి ఇప్పటివరకు వారు నివాసం ఉంటూ గ్రామపంచాయతీ రికార్డులలో దళితులు, బహుజనులు ఇంటి పన్నులు కడుతున్నారని, కరెంటు మీటర్లు ఉన్నాయని అన్నారు. ఈ 70 సంవత్సరాల కాలంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కోట్ల రూపాయల కేటాయించి సిసి రోడ్లు, సిసి డ్రైనేజీలు నిర్మించారని అన్నారు. అంతేకాకుండా రెండు అంగన్వాడీ కేంద్రాలు, ఒక ప్రైమరీ స్కూలు, రామాలయం, వాటర్ ట్యాంకులు ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. గ్రామ రికార్డులలో దళితుల బీసీల పేర్ల మీద రికార్డులో నమోదయ్యాయిని ఇక్కడ నివాసం ఉంటున్న వారు నిరుపేద దళితులని భూమిలేని నిరుపేదలన్నారు. 258 సర్వేనెంబర్ లో 18 ఎకరాల 14 గుంటల భూమి మరియ249 సర్వే నెంబర్లు రెండు ఎకరాల భూమి ఫత్తేపురం గ్రామ వాసి అయిన ధార కేశవరావు మనమరాలు ప్రమీలమ్మ సంజీవమ్మ అందరూ కలిసి సుమారు 27 ఎకరాల భూమిని నిరుపేద దళితులకు బహుజనలకు ఇళ్ల స్థలాలకు, సాగుభూములకు దానం చేశారన్నారు. అప్పుడు దానం చేసిన భూమిని నేడు ఆయన కుమారుడు రాధాకృష్ణ దళిత బహుజనులకు నోటీసులు ఇప్పించడం సరైన చర్య కాదని అధికారులు స్పందించి నిరుపేదలకు న్యాయం చేయాలని కోరారు. దళితులకు అన్యాయం చేయాలని చూస్తే మరో సాయుధ పోరాటం భూ పోరాటం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో చేయాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. వెంటనే ఈ చర్యలను మానుకోవాలని కోరారు. భూములను సందర్శించిన వారిలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్,సిపిఎం మండల కార్యదర్శి సిరికొండ శ్రీను, కెవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు మర్రి నాగేశ్వరరావు, మండల నాయకులు మచ్చ సోమయ్య ఆరే వెంకటయ్య, అల్వాల శ్రీధర్ మడుపు దేవయ్య, సిరికొండ శ్రీను, బొమ్మ కంటి సైదులు, ఆరే వెంకయ్య ,మచ్చ బిక్షం, కొప్పుల మల్లారెడ్డి, శేఖర్ రెడ్డి, కళావతి, సత్యం, మత్సభాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జవహర్ నవోదయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

హనుమకొండ జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామ పరిధిలో హనుమకొండ జిల్లాకు సంబంధించి జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం ప్రభుత్వ భూములను జిల్లా కలెక్టర్ ప్రావిణ్య బుధవారం పరిశీలించారు. జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు కోసం 30 ఎకరాలు కావలసి ఉండగా గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు ప్రతిపాదనలు తయారుచేసి పంపించగా కలెక్టర్ ఆ భూములను పరిశీలించారు. విద్యాలయం ఏర్పాటు కోసం ప్రతిపాదనలు రూపొందించిన ప్రభుత్వ భూములను కలెక్టర్ పరిశీలించి వాటి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భీమదేవరపల్లి తహసీల్దార్ ప్రవీణ్ కుమార్, సర్వేయర్ విజయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## సామాన్యుల గుమ్మం వద్దకే న్యాయసేవలు

**అండగా నిలుస్తున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ**



జయశంకర్ భూపాలపల్లి జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): సామాన్యుల గుమ్మం వద్దకే న్యాయసేవలు తీసుకెళ్లడంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ చొరవ తీసుకుంటుందని డిప్యూటీ మరియు అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్స్ కంప అక్షయ, జి. ప్రియాంక తెలిపారు. వేశాలపల్లి గ్రామ చౌరస్తాలో బుధవారం ప్రజలకు న్యాయ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మొబైల్ వ్యాన్లో వేశాలపల్లి కి చేరుకున్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ బృందం గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఆర్థికంగా వెనకబడిన మరియు నిమ్న కులాల వారికీ, మహిళలకు, వయో వృద్దులకు ఉచిత న్యాయ సహాయం అందించడమే జిల్లా న్యాయసేవాధికార సంస్థ యొక్క లక్షమని వారు తెలిపారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కోర్టు ప్రాంగణాల్లో మార్చి 08 న నిర్వహించబోయే జాతీయ లోక్ అదాలత్ లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కరించబడతాయని, కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు అన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## రైస్ మిల్లుల్లో అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ





మహబూబాబాద్ జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని శ్రీ సాయి, జగదాంబ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ (రెవిన్యూ) కె.వీరబ్రహ్మాచారి, ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైస్ మిల్లులోని రికార్డులను పరిశీలించారు, ప్రభుత్వం సూచించిన జిల్లా లక్ష్యం ప్రకారం కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) డెలివరీలను షెడ్యూల్ ద్వారా వెంటనే చేయాలన్నారు. ఖరీఫ్ 2024 -25 కు సంబంధించి సీఎంఆర్ లక్ష్యాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వేగంగా చేయాలని మిల్లర్లను ఆదేశించారు,
మిల్లులకు సంబంధించి పూర్తి వివరాల రికార్డులను క్రమం తప్పకుండా నమోదు చేసుకోవాలన్నారు. జిల్లా యంత్రాంగం సంబంధిత శాఖలు నిత్యం రైస్ మిల్లులను తనిఖీలు నిర్వహిస్తామని ఇట్టి విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల అధికారి ప్రేమ్ కుమార్, డిఎం సివిల్ సప్లై కృష్ణవేణి, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

# జీవితంలో నిలదొక్కుకునేందుకు పదవ తరగతి టర్నింగ్ పాయింట్

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**





వరంగల్ జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇష్టపడి బాగా చదువుకొని బంగారు భవిష్యత్తును నిర్మించుకోవాలని పదవ తరగతి విద్యరులకు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద హితవు పలికారు. బుధవారం సాయంత్రం వరంగల్ నగరంలోని ఖిలా వరంగల్ అరెల్లి బుచ్చయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ సత్య శారద ఆకస్మిక సందర్శించి 10వ తరగతి విద్యార్థులకు భోదిస్తున్న ప్రత్యేక తరగతులు, అందిస్తున్న స్నాక్స్ ను పరిశీలించారు. ఈ సందర్భముగా జిల్లా కలెక్టర్ పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహనా కల్పించారు. తరగతి గదిలో విద్యార్థులను పలు సబ్జెక్టుల్లో ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. పదిలో, పదికి పది పాయింట్లు సాధించాలని అన్నారు. మీరు పది సంవత్సరాల తరువాత ఎటువంటి ఉద్యోగంలో స్థిరపడాలని అనుకుంటున్నారో, ఆ ఆలోచనకు ఇప్పుడే అంకురార్పణ చేసేసుకోవాలని అన్నారు. జీవితంలో నిలదొక్కుకొనేందుకు పదవ తరగతి పరీక్షలు టర్నింగ్ పాయింట్ అని అన్నారు. ప్రణాళిక బద్దంగా చదవి ఉత్తమ ఫలితాలు సాదించాలని సూచించారు. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకుండా, లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో బాగా చదివి ఉన్నత స్థానాలలో నిలబడి ఇతరులకు స్ఫూర్తిగా నిలవాలని అన్నారు. కష్టపడుతూ ఇష్టపడి చదువుకోవాలని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణ, సమయపాలన పాటిస్తూ పదవ తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని అన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్షలు రాసే ప్యాడ్ లను కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు బుధవారం సాయంత్రం జిల్లాలోని 125 ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి ప్రత్యేక క్లాసుల నిర్వహణ, సాయంత్రం విద్యార్థులకు అందిస్తున్న స్నాక్స్ ను పరిశీలించి విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచేలా ప్రోత్సహించడం జరిగిందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు బోర్డు పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి విద్యార్థి పై దృష్టి సారించి వారు ఉన్నత మార్కులు సాధించే దిశగా సన్నాహాలు చేయాలని ఇప్పటికే పాఠశాల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ ఓ విజయలక్ష్మి, తహసీల్దార్ నాగేశ్వరరావు, ఎం ఈ ఓ ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి విద్యుత్ సమస్య పరిష్కారానికి 1912 టోల్ ఫ్రీహానంబర్

### 24/7 వినియోగదారులకు అందుబాటులో
### 1912 నంబర్‌కు విస్తృతంగా ప్రచారం
### జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్



ములుగు జిల్లా, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): విద్యుత్ వినియోగదారులకుహామరింత మెరుగైన, నాణ్యమైనహా సేవలు అందించడంలో భాగంగా ఎటువంటి విద్యుత్ సమస్యహాతలెత్తిన 1912 టోల్ ఫ్రీనంబర్ కుహాసంప్రదించాలని జిల్లా కలెక్టర్ దివాకర టి. ఎస్. బుదవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యల పరిష్కారానికిహా 1912హాటోల్ ఫ్రీహా నంబర్, 24/7 వినియోగదారులకు అందుబాటులో ఉండిహాసేవలు అందిస్తారని వ్యక్తం చేశారు.హాa )విద్యుత్ సరఫరాలో తలెత్తే హాఇబ్బందులు అనగా : ట్రాన్స్ఫార్మర్ల ఫేయిల్యూర్లు, ఫ్యూజ్ ఆఫ్ కాల్స్ , లోవోల్టేజి, బ్రేక్ డౌన్స్, ప్రమాదభరింతగా ఉన్న స్థంబాలు , వైర్లు తదితరవి.

b) విద్యుత్ బిల్లులహాసమస్యలు అనగా : హాపేరు మార్పు , బిల్లులలోహాతేడాలు, బిల్లులో ఏమైనా హెచ్చుతగ్గులు ఉన్న .

c). విద్యుత్ మీటర్లలో సమస్యలు, అనగా, ఆగిపోయిన మీటర్లు, పోయిన మీటర్లు.

d) విద్యుత్ సర్వీసుల సమస్యలు అనగా, నూతన సర్వీసు మంజూరు మరియు సర్వీస్ క్యాన్సలేషన్.హా

e.) అన్ని రకాల విద్యుత్ సేవలో ఉన్నటువంటి సమస్యలు.హా

మొదలగు అన్ని రకాల హావిద్యుత్హాసమస్యలహాకొరకుహాటోల్ ఫ్రీ నంబర్ 1912 సంప్రదించి సేవలు పొందగలరని కోరారు .

ప్రతి ఒక్క వినియోగదారుడు గుర్తుపెట్టుకునేలాహాటోల్ ఫ్రీ నంబర్ 1912 ను విస్తృతంగా ప్రచారం చేపడుతున్నామని చెప్పారు.

అలాగేహారైతులకుహాఅవగాహన కల్పించడం కొరకుహాఈ నంబర్ ను ప్రతి ట్రాన్స్ఫార్మర్ల పై ముద్రించామనిహాతెలిపారు.

వినియోగదారుల ఫిర్యాదులుహాసత్వర పరిష్కారంహాకావడానికి టోల్ ఫ్రీ నంబర్లు ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. వినియోగదారుల అభిప్రాయం కూడా తీసుకోబడుతుందని అన్నారు.

1)ముఖ్యమయినహాకార్యాలయాలకి నిరంతర విద్యుత్ సరఫరా కిహాతగిన చర్యలు తీసుకోవాలని విద్యుత్ అదికారులని నిర్దేశించడం జరిగినదని ఆయన తెలిపారు.

మండల్ అధికారుల ఫోన్ No :

1)ములుగు :9440814942 2)మల్లంపల్లి :8333923909
3)వెంకటాపూర్ :9440814859 4)గోవిందారవపేట:9440814857
5)తాడ్వాయి :7901678229 6)ఏటురానాగరం :9440814867
8)కన్నాయిగూడెం :7901678232 9)మంగపేట్ :9440814941
10)వాజేడు :9440159490 11)న.వెంకటాపూర్ :944081475

## బ్యాంకర్లు లక్ష్యాలను సాధించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ రాంబాబు



సూర్యాపేట, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): బ్యాంకర్లు ఇచ్చిన లక్ష్యాలను సాదించాలని జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు తెలిపారు. బుధవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ సమావేశ మందిరం లో డి సి సి త్రై మాక్షిక సమావేశం కన్వీనర్ చామల బాపూజీ తో కలిసి జిల్లా అదనపు కలెక్టర్ పి రాంబాబు నిర్వహించారు.బ్యాంకర్లు పంట రుణాలు, దీర్ఘాకాలిక వ్యవసాయ రుణాలు, ప్రాధాన్యత రంగాలకు కేటాయించిన లక్ష్యాలను అధిగామించాలని బ్యాంకర్లకు అదనపు కలెక్టర్ ఆదేశించారు.పంట రుణాలలో ఈ వార్షిక బడ్జెట్ లో 2942.48 కోట్లు లక్ష్యం కాగా 3406.84 కోట్లు సాధించి .115.78 శాతం వృద్ధి సాధించారాని తెలిపారు.దీర్ఘ కాలిక వార్షిక బడ్జెట్ లో 2683.44 కోట్లు లక్ష్యం కాగా 1916.66 కోట్లు లక్ష్యాలను సాధించి, 71.42 శాతం వృద్ధి సాధించారని అన్నారు. ప్రాధాన్యత రంగాలలో 7570.66 కోట్లు లక్ష్యం కాగా 6344.08 కోట్లు సాధించి 83.81 వృద్ధి సాధించారని జిల్లా వార్షిక ప్రణాళికలో వార్షిక బడ్జెట్ 8994.16 కోట్లు లక్ష్యంగా పెట్టుకొనగా 8023.84 కోట్లు సాధించి 89.21 శాతం వృద్ధి సాధించారని అలాగే మొత్తం వ్యవసాయ రుణాలలో వార్షిక బడ్జెట్ లలో 5625.92 కోట్లు లక్ష్యం కాగా 5323.58 కోట్లు సాధించి 94.62 శాతం వృద్ధి సాధించారని అదనపు కలెక్టర్ తెలిపారు. బ్యాంకర్లు వారీగా సాధించిన లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని బ్యాంక్ లలో రుణాలు అందించటంలో వెనకబడి ఉన్నాయని అట్టి బ్యాంక్ లు వారికి కేటాయించిన లక్ష్యలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. బ్యాంకర్లు రైతులకు పంట రుణాల మంజూరులో ఎలాంటి ఇబ్బంది లేకుండా మంజూరు చేయాలని అదనపు కలెక్టర్ సూచించారు.

ఈ సమావేశం ల్ ఆర్బిఐ ఏ జి యమ్ రెహమాన్,ఎస్ బీ ఐ చీఫ్ మేనేజర్ దినేష్, అన్ని బ్యాంక్ ల కంట్రోలర్లు, జడ్పీ సి ఈ ఓ వివి అప్పారావు, వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఇండస్ట్రీయల్ అధికారి సీతారాం, మత్స్యశాఖ అధికారి నాగులు, యస్ సి కార్పొరేషన్ ఏ డి శ్రీనివాస నాయక్, మైనార్టీ అధికారి జగదీశ్వర్ రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో డిఎం అండ్ హెచ్ఓ సందర్శన



వెంకటాపూర్, ఫిబ్రవరి 19 (తీన్మార్ న్యూస్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వెంకటాపూర్ పరిధిలోని జవహర్ నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో జరుగుతున్న జాతీయ నాణ్యత ప్రమాణాల అసెస్మెంట్ ను, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాలరావు సందర్శించారు. జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికేషన్ పొందడం వల్ల ,రోగి భద్రత, మెరుగైన వైద్య సేవలతో పాటు, ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం యొక్క సదుపాయాలు మరియు మౌలిక వసతులు, మెరుగవుతాయని, దాని ద్వారా ప్రజలకు నాణ్యతతో కూడిన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. జాతీయ నాణ్యత ప్రమాణాల సర్టిఫికేషన్ అసెస్మెంట్కు, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లో సమన్వయంతో పనిచేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ విపిన్ కుమార్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ శ్రీకాంత్, డిపిఓ చిరంజీవి, డిస్టిక్ క్వాలిటీ మేనేజర్ శరత్, లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ డాక్టర్. సంఘమిత్ర డాక్టర్. చందన, పి .హెచ్. ఎన్, శోభ సూపర్వైజర్ పుష్పకుమారి ఆరోగ్య కార్యకర్త ఫాతిమా, ఫార్మసిస్ట్, స్వర్ణలత, వెంకట్ రెడ్డి, హరి మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# శ్రీశైలంలో శివరాత్రి శోభ

### యాగశాల ప్రవేశంతో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
### భారీగా ఏర్పాట్లు చేసిన ఆలయ అధికారులు



**శ్రీశైలం,ఫిబ్రవరి 19:** ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రమైన శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ఆలయ ఈవో ఎం.శ్రీనివాసరావు, అర్చకులు, వేద పండితులు యాగశాల ప్రవేశం చేసి ఈ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీభ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్ల ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. భారీగా భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అదనపు క్యూలైన్ల నిర్మాణం, తాత్కాలిక వసతి, పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఆలయ పరిధిలో స్వాగత తోరణాలను ఏర్పాటు చేయడంతో కొత్త కళను సంతరించుకుంది. బుధవారం రాత్రి 7 గంటలకు బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ ఆలయ ప్రధాన ధ్వజస్తంభంపై ధ్వజపటాన్ని ఆవిష్కరించనున్నారు. ఉత్సవాలు ఫిబ్రవరి 19 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు.. అంటే మొత్తం 11 రోజుల పాటు కొనసాగనున్నాయి. ఈ వేడుకల కోసం ఆలయ యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. శ్రీశైలం ఆలయం రంగురంగుల విద్యుత్ దీపాలతో పెయింటింగ్‌లతో సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను తిలకించేందుకు భక్తులు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి సైతం లక్షలాదిగా పాదయాత్ర చేస్తూ నల్లమల కొండలు దాటుకుని శ్రీశైలం తరలివస్తారు. శ్రీశైలం వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా

భక్తుల సౌకర్యార్థం దేవస్థానం అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. తాగునీరు, వసతి, వైద్యం, శ్రీస్వామి అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు.. మినరల్ వాటర్ ఎ÷-లాంట్లు, ప్రసాదం తదితర ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేశారు.ముఖ్యంగా శ్రీస్వామివారి దర్శనానికి భక్తులు ఐదురోజుల ముందు నుంచే పాదయాత్రతో శ్రీశైలం తరలివస్తారు. వారికోసం శ్రీశైలానికి 10 కిలోమీటర్లు దూరంలోని కైలాశద్వారం, భీమునికొలను, హటకేశ్వరం మెట్ల మార్గంలో వచ్చే భక్తులు సేద తీరేందుకు భారీ షెడ్లు నిర్మించారు. తాగేందుకు మంచినీటి ట్యాంకర్లను సిద్ధం చేశారు. పాదయాత్రతో వచ్చే భక్తుల కోసం మట్టి రోడ్లను మరమ్మత్తులు చేసి రోడ్డుపొడువున గ్రావల్ పోసి ట్రాక్టర్లతో చదును చేయించారు. పలుసార్లు భక్తులు పాదయాత్రగా నడిచి వచ్చే బైర్లుటి, నాగులుటి వెంకటాపురం కైలాసద్వారం, భీముని కొలనను ఈవో శ్రీనివాసరావు అధికారులతో స్వయంగా వెళ్లి పర్యవేక్షించారు. శ్రీశైలం వచ్చిన భక్తులకు శ్రీస్వామి అమ్మవారి దర్శనానికి ప్రత్యేక క్యూలైన్లు.. అలాగే చంటి బిడ్డ తల్లులకు, వయవృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేశారు. అలానే క్యూ లైన్ లో దర్శనానికి వెళ్లే భక్తులకు దేవస్థానం ఈ సంవత్సరం 300 ప వాటర్ బాటిల్ ని కూడా అందజేయనుంది. వాటితో పాటు అల్పాహారం పాలు బిస్కెట్లు అందించనున్నారు. దీంతోపాటు ఈ సంవత్సరం భక్తులకు 24 తేదీ నుంచి 27వ తేదీ వరకు ఉచితంగా లడ్డును ఇవ్వనున్నట్లు యువ శ్రీనివాసరావు తెలిపారు ఉత్సవాలలో రోజుకు కోటి 35 లక్షల లీటర్ల నీటిని భక్తులు కు సరఫరా చేయనున్నట్లు తెలిపారు. టూరిస్ట్ బస్టాండు, శివదీక్ష శిబిరాలు, ఆలయ ముందు భాగంలో భక్తులు విశ్రాంతి కోసం భారీ షెడ్లు, షామియానలు ఏర్పాటు చేసారు. పలు చోట్ల వైద్య శిబిరాలు, ఆలయ పరిసరాలలో అంబులెన్స్ లు కూడా అందుబాటులో ఉంచుతామని ఆలయ ఈవో శ్రీనివాసరావు అన్నారు. ఇందులో భాగంగా భక్తుల సౌకర్యార్థం చేపట్టవలసిన పనులపై ఇప్పటికే రాష్ట్ర మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి అనగాని సత్యప్రసాద్ అనిత బీసీ జనార్దన్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి బృందం పర్యటించి దేవస్థానం జిల్లా అధికారులకు సలహాలు సూచనలు చేశారు. అలానే జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ ఆది రాజ్ సింగ్ రాణా, ఆలయ ఈవో శ్రీనివాసరావు సంయుక్తంగా సమీక్ష సమావేశాలు నిర్వహించారు.

శ్రీశైలంలో నేటినుండి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండడంతో ఈ సంవత్సరం మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సుమారు 8 లక్షల పైన 11 రోజులపాటు భక్తులు వస్తారని ఈవో శ్రీనివాసరావు అంచనా వేశారు. అందులో భాగంగా ఆర్జిత సేవలు నిలుపుదల చేసి భక్తులందరికీ శ్రీస్వామివారి అలంకార దర్శనానికి అనుమతిస్తున్నట్లు ఈవో శ్రీనివాసరావు తెలిపారు. జ్యోతిర్ముడి కలిగిన శివస్వాములకు మాత్రమే రేపటి నుండి మార్చి 23 వరకు ఉచిత స్పర్శదర్శనం కల్పిస్తున్నామని అలానే మలధారణ కలిగిన శివస్వాములకు చంద్రావతీ కల్యాణ మండపం ద్వారా ప్రత్యేక దర్శన క్యూలైన్ ఏర్పాటు చేశామననారు. ముఖ్యంగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా క్షేత్ర పరిధిలో పలు చోట్ల 39 ఎకరాలలో వాహనాలకు పార్కింగ్ ఏర్పాటు చేశారు. శివరాత్రికి విచ్చేసే భక్తులకు 35 లక్షల లడ్డూలు అందుబాటులో ఉంచడంతోపాటు పలుచోట్ల లడ్డు కౌంటర్లను ఏర్పాటు చేశారు.. పాతాళగంగలో గంగ మెట్ల వద్ద అలానే రాజుల సత్రం వద్ద భక్తుల స్నానానికి షవర్లను ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు. పార్కింగ్ ప్రదేశాల నుంచి ఆలయానికి వసతి గృహాలకు భక్తులు వెళ్ళడానికి ఇబ్బందులు లేకుండా 10 ఉచిత బస్సులను ఏర్పాటు చేశారు. అధికారులతో సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టం చేశామని భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకున్నామని ఆలయ ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

## సికింద్రాబాద్ పాస్‌పార్టు ఆఫీస్‌కు మాజీ సీఎం

### పాస్‌పోర్టు రెన్యువల్ కోసం వెళ్లిన కేసీఆర్



**హైదరాబాద్,ఫిబ్రవరి19 :** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సికింద్రాబాద్ పాస్‌పోర్టు కార్యాలయానికి వెళ్లారు. బుధవారం ఉదయం ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రం నుంచి తన సతీమణితో కలిసి కేసీఆర్ పాస్‌పోర్టు ఆఫీసు వచ్చారు. తన పాస్‌పోర్టును రెన్యూవల్ చేసుకోనున్నట్లు తెలుస్తోంది. డిప్లమాటిక్ పాస్‌పోర్టును సబ్‌మిట్ చేసి సాధారణ పాస్‌పోర్టును తీసుకునేందుకు కేసీఆర్ పాస్‌పోర్టు కార్యాలయానికి వచ్చారని అధికార వర్గాలు చెబుతున్నాయి. కేసీఆర్‌తో పాటు సతీమణి, జోగినపల్లి సంతోష్ ఆఫీస్‌లోకి వెళ్లారు. దాదాపు అరగంట పాటు రెన్యూవల్ ప్రాసెస్ జరిగింది. పాస్‌పోర్టు రెన్యూవల్ అనంతరం కేసీఆర్ పాస్‌పోర్టు ఆఫీసు నుంచి నందినగర్‌లోని నివాసానికి బయలుదేరి వెళ్లారు. కాగా.. త్వరలో మాజీ సీఎం అమెరికాకు వెళ్తారనే ప్రచారం జోరుగా జరుగుతున్న వేళ కేసీఆర్ పాస్‌పోర్టు రెన్యూవల్ చేసుకోవడం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. పాస్ట్‌పోర్టు తీసుకున్న తర్వాత నెలా, రెండు నెలల్లో అమెరికా ప్రయాణం ఉంటుందని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అయితే పది సంవత్సరాల పాటు ముఖ్యమంత్రిగా చేసినప్పుడు కానీ, సీఎం అవకముందు కూడా కేసీఆర్ అమెరికా గడప దొక్కిన దాఖలాలు లేవు. మనవడు హిమాన్షు అమెరికాలో ఉన్నతవిద్యాభ్యాసం అభ్యసిస్తున్న నేపథ్యంలో అక్కడకు వెళ్తారని, రెండు నెలల పాటు అక్కడే కేసీఆర్ ఉంటారనే ప్రచారం జరుగుతోంది.

## ఫామ్‌హౌజ్ వీడారు..కానీ ప్రజలను చేరుకోలేరు

### ఉప ఎన్నికలంటూ కార్యకర్తలను నమ్మించే యత్నం
### కెసిఆర్ వ్యాఖ్యలపై మండిపడ్డ ఎంపి చామల



**హైదరాబాద్,ఫిబ్రవరి19 :** ఉప ఎన్నికలంటూ ..బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ వ్యాఖ్యలపై భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కేసీఆర్ త్వరలో ఉప ఎన్నికలు వస్తాయి అంటున్నారు. ఐదు ఏండ్ల వరకు ఉప ఎన్నికలు వచ్చే అవకాశం లేదు. లోకల్ బాడీ ఎన్నికల్లో కూడా మీకు ఉనికి లేదు. అందుకే కేసీఆర్ ఇలాంటి మెసేజ్ లు ఇస్తున్నారని మండిపడ్డారు. ఇదంతా కేవలం కార్యకర్తల్లో ధైర్యం నింపడానికేనని అన్నారు. ఫామ్ హౌస్ నుంచి బయటకు వచ్చి కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయిందని కార్యకర్తల ముందు అంటున్నారు. కేవలం కార్యకర్తలను ఉత్తేజ పర్చడానికే కేసీఆర్ కాంగ్రెస్ గ్రాఫ్ పడిపోయింది చెప్పారు. ఆయనకు చిత్తశుద్ధే లేదు. చిత్త శుద్ధి ఉంటే ప్రతిపక్ష నేతగా అసెంబ్లీ కి వచ్చి ప్రజల సమస్యలు చర్చించే వారుని ఎంపీ కిరణ్‌కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా.. తెలంగాణ భవన్‌లో కేసీఆర్ అధ్యక్షతన పార్టీ విస్తృత స్థాయి కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశర చేశారు. ఈ సందర్భంగా మాజీ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలో ఉపఎన్నికలు వస్తాయని బాంబు పేల్చారు. 'సిల్వర్ జూబ్లీ వేడుకలే ఇంపా÷-ట్గ÷ంట్. ఈ సీఎం ఇంతలా ప్రజల్లో వ్యతిరేకత ఇంత తొందరగా వస్తుందనుకోలేదు. మనం ప్రతి సంవత్సరం ఆదాయం పెంచుకుంటూ పోయాం. ఈ ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆదాయం పడిపోతుంది. అదే అధికారులు ఉన్నారు. కానీ ఈ ప్రభుత్వానికి చేయించుకోవడం రావడం లేదు. త్వరలో ఉపఎన్నికలు వస్తాయి. మీరు సిద్ధంగా ఉండండి. మళ్లీ మనదే అధికారం.. మీరే ఎమ్మెల్యేలు అవుతారని కేసీఆర్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలను చామల తీవ్రంగా ఖండించారు. బిఆర్ఎస్‌ను ప్రజలు ఇక నమ్మేస్థితిలో లేరని అన్నారు.

## ప్రతీది గుర్తు పెట్టుకుంటున్నా...

### హెూటల్ మూసివేయడంపై కేటీఆర్ మండిపాటు



హైదరాబాద్, ఫిబ్రవరి 19 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ కక్షపూరిత రాజకీయాలకు పాల్పడతుందని, మొన్న కేసీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా స్వీట్లు పంచినందుకు టీచర్‌ను సస్పెండ్ చేశారని, ఇప్పుడు నా ఫొటో పెట్టుకున్నందుకు టీ హెూటల్‌నే మూసివేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ప్రతీది గుర్తుపెట్టుకుంటున్నానని.. ఎవర్నీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఇదే మాట మీద ఉంటానని మీకు మాట ఇస్తున్నానని స్పష్టం చేశారు. ఈ మేరకు టీ షాపు యజమాని బత్తుల శ్రీనివాస్ ఆవేదనతో మాట్లాడుతున్న ఒక వీడియోను షేర్ చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన బత్తుల శ్రీనివాస్ బతుకమ్మ ఘాట్ వద్ద గత నాలుగేళ్లుగా 'కేటీఆర్ టీ స్టాల్' నడిపిస్తున్నాడు. హెూటల్ బోర్డుపై కూడా కేటీఆర్ ఫొటో పెట్టుకున్నారు. ఇది గమనించిన సిరిసిల్ల జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆ హెూటల్‌ను మూసేయించారు. అసలు ఆ టీ స్టాల్‌కు ట్రేడ్ లైసెన్స్ ఉందా? లేకుంటే హెూటల్‌ను సీజ్ చేయండి అంటూ మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ హుకుంతో వెంటనే రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది టీ స్టాల్‌ను బలవంతంగా మూసివేయించారు.

### సీఎం రేవంత్‌రెడ్డికి రూ. 4.20 లక్షల కోట్లు జరిమానా వేసిన తప్పులేదు : కేటీఆర్

**హైదరాబాద్,ఫిబ్రవరి 19 :** సింగపూర్ పార్లమెంట్‌లో రెండు అబద్ధాలు చెప్పిన ఎంపీకి 14వేల డాలర్ల జరిమానా విధించిన విషయాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రస్తావించారు. మరి కాళేశ్వరం గురించి, రాష్ట్ర అప్పుల గురించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి, రైతు రుణమాఫీ గురించి, రైతు బంధు గురించి, నాలుగు వేల పింఛన్లు అని, మహిళలకు రూ.2500 అని.. ఇలా 420 అబద్ధాలు చెప్పిన ముసలి నక్క కాంగ్రెస్ పార్టీకి, రేవంత్ రెడ్డిక 4.20 లక్ష కోట్ల జరిమానా వేసిన తప్పులేదని విమర్శించారు. పార్లమెంటరీ కమిటీ ముందు అబద్ధాలు చెప్పినందుకు భారత సంతతికి చెందిన సింగపూర్ ఎంపీ ప్రీతమ్ సింగ్ (48)కి అక్కడి కోర్టు జరిమానా విధించింది. ఒక్కో అబద్ధానికి రూ.7వేల సింగపూర్ డాలర్ల చొప్పున.. రెండు అబద్ధాలకు 14వేల సింగపూర్ డాలర్లను కట్టాలని ఆదేశించింది.

## ‘ఫ్రెషర్లపై బౌన్సర్లను ప్రయోగించలేదు’..

### మైసూరు క్యాంపస్ వివాదంపై ఇన్ఫీ!




కర్ణాటకలోని మైసూరు క్యాంపస్‌లో దాదాపు 300 మందికి పైగా ట్రైనీలను ఇన్ఫోసిస్ తొలగించడం వివాదాస్పదమైంది. వరుస ఎవాల్యుయేషన్ పరీక్షల్లో విఫలమవడంతో వారిని తొలగించినట్లు వార్తలు వచ్చాయి. అంతేకాదు.. అలా ఫెయిల్ అయిన వారిని బలవంతంగా ఆఫీసు క్యాంపస్ నుంచి బయటకు పంపినట్లు ఆరోపణలు వచ్చాయి. ఈ విషయంపై తాజాగా ఇన్ఫీ స్పందించింది. తాము అలాంటి బలవంత ప్రయోగాలకు పాల్పడలేదని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇన్ఫోసిస్ చీఫ్ హ్యూమన్ రీసోర్సెస్ ఆఫీసర్ షాజీ మాథ్యూ తాజాగా పీటీఐకి వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడారు. ట్రైనీలను బెదిరించి క్యాంపస్ నుంచి బయటకు పంపారంటూ వచ్చిన వార్తలను మాథ్యూ ఖండించారు. బౌన్సర్లను పెట్టి బయటకు గెంటించడమనేది అసత్య ప్రచారమన్నారు. ఉద్దేశపూర్వకంగా ఫెయిల్ చేసేందుకు కఠినంగా పరీక్ష నిర్వహించారంటూ వచ్చిన ఆరోపణలనూ తోసిపుచ్చారు. “ఎంతో శ్రమకోర్చి వారికి శిక్షణ ఇస్తాం. పైగా వారికి శిక్షణ సమయంలో జీతం చెల్లిస్తాం. అలాంటి వారిని వెళ్లనివ్వడం వారికే కాదు కంపెనీకి మంచిది కాదు” అని మాథ్యూ పేర్కొన్నారు. వరుసగా మూడు ఎవాల్యుయేషన్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారినే తొలగించినట్లు ఆయన వెల్లడించారు. ఫ్రెషర్లను తొలగించడంపై ఐటీ ఉద్యోగుల సంఘం నైట్స్ కార్మిక శాఖకు ఫిర్యాదు చేసింది. కార్మిక శాఖ ఆదేశాల మేరకు కర్ణాటక కార్మిక శాఖ ఇన్ఫోసిస్‌పై దర్యాప్తు చేపట్టింది. దీనిపై మాథ్యూ స్పందిస్తూ.. “కార్మిక శాఖ మాతో సంప్రదింపులు జరుపుతోంది. మా శిక్షణ ప్రక్రియ, మూల్యాంకనం మొదలైన వాటిని అర్థం చేసుకుంటున్నారు. వారికి పూర్తిగా సహకరిస్తున్నాం” అని తెలిపారు. తొలగించిన వారిని తిరిగి నియమించుకొనే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా ఆయన స్పష్టంచేశారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో 20 వేల మంది ఫ్రెషర్‌లను నియమించుకునే అవకాశం ఉందని తెలిపారు. వారందరికీ అత్యుత్తమ శిక్షణ లభిస్తుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.

### 10వేలకే ఆండ్రాయిడ్ 15తో

## శాంసంగ్ మరో 5జీ ఫోన్



ప్రముఖ మొబైల్ తయారీ సంస్థ శాంసంగ్ దేశీయ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లోకి మరో కొత్త 5జీ మొబైల్‌ను తీసుకొచ్చింది. ఇటీవల ఎఫ్06 స్మార్ట్‌ఫోన్‌ను లాంచ్ చేసిన ఆ సంస్థ.. తాజాగా ఏ06 5జీ ఫోన్‌ను తీసుకొచ్చింది. గతేడాది ఇదే ఫోన్‌ను 4జీ వేరియంట్‌లో తీసుకురావడం గమనార్హం. తాజాగా దీనికి 5జీ నెట్‌వర్క్ సపోర్ట్‌ను జోడించింది. ఔటాఫ్‌ది బాక్స్ ఆండ్రాయిడ్ 15తో పనిచేస్తుంది. అంతేకాదు మరో నాలుగు మేజర్ ఆండ్రాయిడ్ అప్‌డేట్లు ఇస్తామని కంపెనీ చెబుతోంది. శాంసంగ్ ఏ06 స్మార్ట్‌ఫోన్ 6.7 అంగుళాల హెచ్‌డీ+ డిస్‌ప్లేతో వస్తోంది. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 చిప్‌సెట్ అమర్చారు. ర్యామ్ ప్లస్ ఫీచర్ ద్వారా 12 జీబీ వరకు ర్యామ్‌ను పెంచుకోవచ్చు. వెనుక వైపు 50 ఎంపీ కెమెరాతో పాటు 2 ఎంపీ కెమెరా డెప్త్ సెన్సర్ ఇచ్చారు. ముందు వైపు 8 ఎంపీ కెమెరా ఉంది. ఈ ఫోన్ ఐపీ54 రేటింగ్‌తో వస్తోంది. 5000 ఎంఏహెచ్ బ్యాటరీ, 25 ఫాస్ట్ ఛార్జింగ్‌కు సపోర్ట్ చేస్తుంది. 12 5జీ బ్యాండ్లకు తమ ఫోన్ సపోర్ట్ చేస్తుందని కంపెనీ చెబుతోంది. ఔటాఫ్ బాక్స్ ఆండ్రాయిడ్ 15తో కూడిన వన్‌యూఐ 7తో వస్తోంది. నాలుగేళ్లపాటు మేజర్ ఆండ్రాయిడ్ అప్‌డేట్స్, నాలుగేళ్ల పాటు సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇస్తామని కంపెనీ చెబుతోంది. ఇక ఈ ఫోన్ ధర విషయానికొస్తే.. 4జీబీ+64జీబీ వేరియంట్ ధరను రూ.10,499గా కంపెనీ నిర్ణయించింది. 4జీబీ+128జీబీ వేరియంట్ ధర రూ.11,499గా పేర్కొంది. 6జీబీ+128జీబీ వేరియంట్ రూ.12,999కు లభిస్తుంది. బ్లాక్, గ్రే, లైట్ గ్రీన్ షేడ్స్ రంగుల్లో లభిస్తుంది. రూ.129 చెల్లించి శాంసంగ్ కేర్+ సబ్‌స్క్రిప్షన్ తీసుకుంటే ఏడాది పాటు స్క్రీన్ రీప్లేస్ వారెంటీ లభిస్తుంది. శాంసంగ్ ఎక్స్‌క్లూజివ్ స్టోర్‌తో పాటు అన్ని రిటైల్ ఔట్‌లెట్లలో ఈ ఫోన్ లభిస్తుంది. బాక్స్‌లో కేవలం టైప్-సి కేబుల్ మాత్రమే లభిస్తుంది. ఛార్జింగ్ అడాప్టర్ వేరేగా కొనుగోలు చేయాల్సి ఉంటుంది.



### ఏప్రిల్ నుంచి భారత్‌లో

## టెస్లా కార్ల విక్రయాలు..!

అమెరికా దిగ్గజ ఈవీ కంపెనీ టెస్లా.. భారతలో అడుగుపెట్టేందుకు రంగం సిద్ధమైనట్లే కన్పిస్తోంది. ఇప్పటికే ఈ సంస్థ ఇక్కడ నియామకాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. షోరూంల ఏర్పాటు కోసం కూడా ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఇక, ఈ ఏడాది ఏప్రిల్ నుంచి భారత మార్కెట్లో టెస్లా ఈవీ విక్రయాలు ప్రారంభం కానున్నట్లు తాజాగా కథనాలు వెలువడుతున్నాయి. వీటి ప్రారంభ ధర రూ.21లక్షలుగా ఉండనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతానికి కంపెనీ రిటైల్ కార్యకలాపాలను మాత్రమే ప్రారంభించనున్నట్లు సమాచారం. ఈ మేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ సదరు కథనాలు వెల్లడించాయి. జర్మనీలోని బెర్లిన్ ప్లాంట్ నుంచి ఈవీ కార్లను దిగుమతి చేసుకుని భారత మార్కెట్లో విక్రయించేందుకు టెస్లా సన్నాహాలు ప్రారంభించిందట. షోరూంల ఏర్పాటు కోసం ముంబయిలోని బీకేసీ బిజినెస్ డిస్ట్రిక్ట్, న్యూదిల్లీలోని ఏరోసిటీ ప్రాంతాలను ఎంపిక చేసుకున్నట్లు సమాచారం. తొలుత 25వేల డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు రూ.21లక్షలు) వరకు విలువ చేసే ఎలక్ట్రిక్ వాహనాలను టెస్లా విక్రయించనున్నట్లు సదరు కథనాలు పేర్కొన్నాయి. ప్రస్తుతానికి భారత్‌లో ఈవీల తయారీపై టెస్లా ఇంకా ఎలాంటి స్పష్టతనివ్వలేదు. అయితే, భారత ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారుల నుంచి విడిభాగాలను కొనుగోళ్లను మరింత పెంచుకోవాలని కంపెనీ ప్రణాళికలు చేస్తున్నట్లు సమాచారం. టెస్లా భారత మార్కెట్లోకి ప్రవేశించేందుకు 2021 నుంచి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందుకోసం ఈవీలపై దిగుమతి సుంకాలను గణనీయంగా తగ్గించాలని మస్క్ కంపెనీ డిమాండ్ చేసింది. ఇందుకు కేంద్రప్రభుత్వం కొన్ని షరతులు విధించింది. దేశీయంగా తయారీ ప్రారంభించడంతో పాటు ప్రాంతీయంగానే విడిభాగాలు కొనుగోలు చేయాలన్న కండీషన్ పెట్టింది. ఈ క్రమంలోనే గతవారం భారత ప్రధాని మోదీతో మస్క్ భేటీ అయ్యారు. ఈవీ విక్రయాల అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే కంపెనీ తాజాగా భారత్‌లో నియామకాల ప్రక్రియ చేపట్టి.. ఎంట్రీపై సంకేతాలిచ్చింది.

# ఎల్ఐసీ స్మార్ట్ పెన్షన్ ప్లాన్

## సింగిల్ పేమెంట్‌తో జీవితాంతం ఆదాయం!

ఆర్థిక స్వేచ్ఛపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. భవిష్యత్ కోసం ఇప్పటి నుంచే ప్రణాళికలు వేసుకోవడం పెరిగింది. ముఖ్యంగా పదవీ విరమణ చేసిన తర్వాత క్రమం తప్పకుండా ఆదాయం వచ్చేలా ముందస్తుగా ఏర్పాటు చేసుకుంటున్నారు. ఇలాంటి వారి కోసమే ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ.. ‘స్మార్ట్ పెన్షన్ ప్లాన్’ పేరిట కొత్త యాన్యుటీ ప్లాన్‌ను తీసుకొచ్చింది. సింగిల్ ప్రీమియంతో జీవితాంతం పెన్షన్ పొందొచ్చన్నమాట. సింగిల్ లైఫ్‌తో పాటు జాయింట్ లైఫ్ యాన్యుటీ సదుపాయాలను ఈ ప్లాన్ అందిస్తోంది. ఎల్ఐసీ కొత్త పెన్షన్ ప్లాన్... నాన్ పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్, ఇండివిడ్యువల్/ గ్రూప్, సేవింగ్స్), తక్షణ యాన్యుటీ ప్లాన్ (ప్లాన్ 879). వార్షికంగా, ఆరు నెలలు, మూడు నెలలు, నెలవారీ యాన్యుటీ చెల్లింపులు పొందొచ్చు. కొన్ని షరతులకు లోబడి పాక్షికంగా లేదా పూర్తిగా విత్‌డ్రా చేసుకునే సదుపాయం ఉంది. రుణ సదుపాయం కూడా ఉంది. నేషనల్ పెన్షన్ సిస్టమ్ సబ్‌స్క్రైబర్లు తక్షణ యాన్యుటీ పొందే వెసులుబాటును ఈ ప్లాన్ కల్పిస్తోంది.




### పెన్షన్ ప్లాన్ పూర్తి వివరాలు

- 18 నుంచి 100 ఏళ్లలోపు (యాన్యుటీ ఎంపికను బట్టి) ఎవరైనా ఈ స్మార్ట్ పెన్షన్ ప్లాన్‌ను కొనుగోలు చేయొచ్చు.
- ఈ ప్లాన్‌కు మార్కెట్‌తో సంబంధం లేదు. మార్కెట్ ఒడుదొడుకులతో సంబంధం లేకుండా మన సొమ్ముకు గ్యారెంటీ ఉంటుంది.
- ఇందులో సింగిల్ లైఫ్‌తో పాటు జాయింట్ లైఫ్ కవర్ కూడా ఉంది. అంటే జీవిత భాగస్వామికి కూడా ఆర్థిక భద్రత అందించొచ్చు.
- నెలవారీ వెయ్యి రూపాయలు, మూడు నెలలకు రూ.3వేలు, ఏడాదికి రూ.12వేలు చొప్పున కనీసం యాన్యుటీ పొందొచ్చు.
- నెలవారీ, మూడు నెలలు, ఆరు నెలలు, ఏడాదికోసారి చొప్పున పాలసీదారుడు యాన్యుటీ చెల్లింపుల ఆప్షన్ ఎంచుకోవచ్చు.
- కనీసం రూ.1 లక్ష వెచ్చించాల్సి ఉంటుంది. గరిష్ఠ కొనుగోలుపై పరిమితి లేదు (ఆమోదానికి లోబడి)
- ఈ పాలసీకి ఫ్రీ-లుక్ పీరియడ్ లేదా మూడు నెలలు దాటిన తర్వాత రుణ సదుపాయం కూడా పొందొచ్చు. ఆదాయపు పన్ను మినహాయింపు కూడా ఉంది.

### యాన్యుటీ ఆప్షన్లు..

- మీ జీవితం మొత్తం పెన్షన్ పొందే అవకాశం
- 5/10/15/20 సంవత్సరాల పాటు ఎంపిక చేసిన కాలానికి గ్యారంటీ పెన్షన్
- ఏటా 3% లేదా 6% పెరుగుతూ ఉండే పెన్షన్
- జీవితాంతం పెన్షన్.. పైగా కట్టిన మొత్తం తిరిగి అందించే సదుపాయం
- జాయింట్ లైఫ్ పెన్షన్‌తో భార్యాభర్తలు జీవితాంతం పెన్షన్ పొందే అవకాశం
- నూరు శాతం పెన్షన్.. కొనుగోలు చేసిన మొత్తం పూర్తి రిఫండ్
- 50% లేదా 100% పెన్షన్ భాగస్వామికి వచ్చేలా
- 75/80 ఏళ్ల వయస్సు వచ్చాక మొత్తం పెట్టుబడి తిరిగి వచ్చే పెన్షన్ ఆప్షన్

## ఎల్ఐసీ పెట్టుబడుల్లో 84 వేల కోట్లు హాంఫట్

### స్టాక్ మార్కెట్ ఎఫెక్ట్..

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీగా తమ విలువను కోల్పోయాయి. గరిష్ఠాల నుంచి 10 శాతానికి పైగా నష్టాల్లో ట్రేడవుతున్నాయి. ముఖ్యంగా విదేశీ సంస్థాగత మదుపర్లు తరలిపోవడం, వాణిజ్య యుద్ధభయాలు వంటివి ఇందుకు కారణం. ఈ నేపథ్యంలో దలాల్ స్ట్రీట్‌లో పెట్టుబడులు పెట్టిన వారి పోర్ట్‌ఫోలియోల్లో నిధులు కరిగిపోతున్నాయి. ప్రముఖ మదుపర్లుగా పేరొందిన టాప్-10 వ్యక్తుల పోర్ట్‌ఫోలియోలు రూ.81 వేల కోట్ల విలువను కోల్పోగా... ఎల్ఐసీ సైతం పెద్ద మొత్తంలో నష్టపోయింది. ఒకటిన్నర నెలలో ఏకంగా రూ.84 వేల కోట్లు కోల్పోయింది. జీవిత బీమా సంస్థ అయిన ఎల్ఐసీ.. లిస్టెడ్ కంపెనీల్లోనూ పెట్టుబడులు పెడుతుంటుంది. స్టాక్ మార్కెట్‌లో ఇటీవల కరెక్షన్ కారణంగా ఎల్ఐసీ పెట్టుబడుల విలువ జనవరి 1 నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.84వేల కోట్లు పడిపోయింది. గతేడాది డిసెంబర్ త్రైమాసికంలో ఎల్ఐసీ హోల్డింగ్స్ విలువ రూ.14.72 ట్రిలియన్లు (రూ.14.72 లక్షల కోట్లు)గా ఉంది. 2025 ఫిబ్రవరి 18 నాటికి ఆ విలువ రూ.13.87 ట్రిలియన్లకు (రూ.13.87 లక్షల కోట్లకు) చేరింది. అంటే మొత్తం స్టాక్ విలువ రూ.84,247 కోట్లు (5.7 శాతం) మేర హరించుకుపోయింది. 2024 డిసెంబర్ నాటికి ఎల్ఐసీ 330 కంపెనీల్లో 1 శాతానికి పైగా వాటా కలిగిఉంది. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల్లో మొత్తం మార్కెట్ విలువలో ఈ కంపెనీలే దాదాపు 66 శాతం వాటా కలిగిఉన్నాయి. స్టాక్ మార్కెట్ నష్టాల నేపథ్యంలో ఆయా కంపెనీల షేర్ల విలువ క్రమంగా తగ్గుతోంది. ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టిన వాటిలో ఐటీసీ (రూ.11,863 కోట్లు), ఎల్అండ్‌టీ (రూ.6,713 కోట్లు), స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ.5,647 కోట్లు) వంటి ప్రధాన కంపెనీల్లో అధిక పెట్టుబడులు ఉన్నాయి. వీటితో పాటు టీసీఎస్, జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అదానీ పోర్ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐడీబీఐ బ్యాంక్‌ల్లోనూ ఎల్ఐసీ పెట్టుబడులు పెట్టింది.




## ఫ్లాట్‌గా ముగిసిన సూచీలు



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు బుధవారం ఫ్లాట్‌గా ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్లలో మిశ్రమ సంకేతాల నడుమ ఉదయం నష్టాలతో ట్రేడింగ్ మొదలుపెట్టిన సూచీలు ఒడుదొడుకులకు లోనయ్యాయి. రోజంతా లాభ- నష్టాల మధ్య చలించిన సూచీలు చివరకు ఫ్లాట్‌గా ముగిశాయి. సెన్సెక్స్ ఉదయం 75,787.27 (క్రితం ముగింపు 75,967) వద్ద నష్టంతో ట్రేడింగ్ మొదలుపెట్టింది. ఇంట్రాడేలో 75,581 వద్ద కనిష్ఠాన్ని తాకింది. చివరకు 28 పాయింట్లు తగ్గి 75,939 వద్ద ముగిసింది. నిఫ్టీ 12 పాయింట్లు నష్టంతో 22,932 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌యూఎల్, భారతీ ఎయిర్‌టెల్, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్, సన్‌ఫార్మా, బజాజ్‌ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, ఎంఅండ్ఎం, టెక్ మహీంద్రా షేర్లు నష్టపోయాయి. జొమాటో, యాక్సిస్ బ్యాంక్, ఎల్అండ్‌టీ, ఐసీఐసీఐ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఎన్టీపీసీ, టాటా స్టీల్, ఇండస్ఇండ్ బ్యాంక్ షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 76.30 డాలర్ల వద్ద ట్రేడవుతుండగా.. బంగారం ఔన్సు 2,962.90 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

## ఐటీ సెక్టార్‌లో అతిపెద్ద ఐపీఓ హెక్సావేర్ టెక్నాలజీస్..

### 5% ప్రీమియంతో లిస్టింగ్




ఐటీ సేవల సంస్థ హెక్సావేర్ టెక్నాలజీస్ లిమిటెడ్ షేర్లు నేడు స్టాక్ మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. ఐటీ సెక్టార్‌లో అతిపెద్ద ఐపీఓగా వచ్చిన ఈ కంపెనీ షేర్లు నేడు దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చాయి. ఇష్యూ ధర రూ.708తో పోలిస్తే ఎన్ఎస్ఈలో 5 శాతం ప్రీమియంతో రూ.745.50 వద్ద లిస్ట్ అయ్యాయి. మదుపరులకు స్వల్ప లాభాల్ని తెచ్చిపెట్టాయి. ఇక బీఎస్ఈలో రూ.731 వద్ద ప్రారంభమయ్యాయి. ముంబయి కేంద్రంగా సేవలందిస్తున్న హెక్సావేర్ టెక్నాలజీస్ రూ.8,750 కోట్లు సమీకరించేందుకు పబ్లిక్ ఇష్యూకి వచ్చింది. ఈ ఐపీఓను పూర్తి ఆఫర్ ఫర్ సేల్‌లో నిర్వహించింది. ధరల శ్రేణిని రూ.674-708గా నిర్ణయించింది. ఈ పబ్లిక్ ఇష్యూ మొత్తంగా 2.66 రెట్ల సబ్‌స్క్రిప్షన్‌ను అందుకుంది. క్వాలిఫైడ్ ఇన్‌స్టిట్యూషనల్ బయ్యర్ల కోటా 9.09 రెట్లు సబ్‌స్క్రైబ్ అవ్వగా.. నాన్ ఇన్‌స్టిట్యూషనల్ కోటా 0.20 శాతం సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. రిటైల్ ఇన్వెస్టర్ల పోర్షన్ 0.11 రెట్ల మాత్రమే సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఐటీ సెక్టార్‌లో అతిపెద్ద ఐపీఓ ఇదే కావడం గమనార్హం. రెండు దశాబ్దాల క్రితం టీసీఎస్ రూ.4,700 కోట్లు పబ్లిక్ ఇష్యూ ద్వారా సమీకరించింది. 10:30గంటల సమయంలో కంపెనీ షేర్లు రూ.755 వద్ద ట్రేడవుతున్నాయి.

## ‘ఎక్స్’ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ ధర డబుల్

### మళ్లీ పెంచిన మస్క్



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఆధ్వర్యంలోని సామాజిక మాధ్యమం ‘ఎక్స్’ తన ప్రీమియం ప్లస్ ధరల్ని భారత్‌లో పెంచింది. సబ్‌స్క్రిప్షన్ ప్లాన్ ధరల్ని ఏకంగా రెట్టింపు చేసింది. గత మూడు నెలల్లో ఈ ప్లాన్ ధరల్ని పెంచడం ఇది రెండో సారి. గ్రోక్ 3 ఏఐ మోడల్‌ను విడుదల చేసిన తర్వాత ప్లాన్ ధరల్ని పెంచడం గమనార్హం. మస్క్‌కు చెందిన కృత్రిమ మేధ అంకుర సంస్థ ‘ఎక్స్ఏఐ.. గ్రోక్ 3 సేవల్ని తాజాగా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ ఏఐ మోడల్ సామర్థ్యాలు వినియోగించాలంటే ‘ఎక్స్’లో ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సి ఉంటుందని కంపెనీ లాంచింగ్ సమయంలో తెలిపింది. ఈ నేపథ్యంలో తాజాగా ప్లాన్ ధరల్ని పెంచింది. ఇప్పటి వరకు ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ ధర భారత్‌లో నెలకు రూ.1,750 ఉండేది. తాజాగా దీన్ని రూ.3,470కి పెంచింది. ఇక ఏడాది ప్లాన్ ధర రూ.18,300 నుంచి రూ.34,340కి పెంచింది. అంటే ధరల్ని దాదాపు రెట్టింపు చేసింది. తన ప్లాట్‌ఫామ్ ఆదాయాన్ని పెంచుకొనేందుకు ‘ఎక్స్’ 2023 అక్టోబర్‌లోనే తొలి సారి ప్రీమియం ప్లస్ సబ్‌స్క్రిప్షన్ తీసుకొచ్చింది. తొలుత ప్లాన్ ధర రూ.1,300గా ఉండేది. ఆ తర్వాత గతేడాది డిసెంబర్‌లో దాని ధరను రూ.1,750కి పెంచింది. తాజాగా ఈ ధరను రూ.3,470కు చేర్చింది. ఇతర ప్లాన్ల ధరలను మాత్రం అలానే ఉంచింది. ఎక్స్‌లో బేసిక్, ప్రీమియం, ప్రీమియం ప్లస్ పేరిట మూడు రకాల ప్లాన్లు అందిస్తోంది. బేసిక్ ప్లాన్ ధర ప్రస్తుతం నెలకు రూ.244గా ఉంది. ఇక ప్రీమియం ప్లాన్ ధర నెలకు రూ.650గా ఉంది. యాడ్- ఫ్రీ ఎక్స్‌పీరియన్స్, సుదీర్ఘ ఆర్టికల్స్ రాసే సౌలభ్యం ప్రీమియం ప్లాన్లలో లభిస్తుంది.

## ఆ దేశంలోని ఇళ్లల్లో కిచెన్ ఉండదు

### నిఖిల్ కామత్ పోస్టు దేనిగురించి అంటే..?



ప్రముఖ స్టాక్ బ్రోకరేజ్ సంస్థ జెరోదా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నెట్టింట్లో ఆసక్తికర విషయాలు పంచుకుంటుంటారు. ఇటీవల సింగపూర్ పర్యటనకు వెళ్లిన ఆయన అక్కడ గుర్తించిన ఓ విషయాన్ని వెల్లడించారు. దానిని మనదేశ వ్యవస్థతో పోలుస్తూ పోస్టు పెట్టారు. “ఇటీవల నేను సింగపూర్ వెళ్లాను. నేను కలిసిన వాళ్లలో చాలామంది ఒకే మాట చెప్పారు. తాము ఇళ్లల్లో వంట చేసుకోవట్లేదన్నారు. మరికొందరేమో తమ ఇళ్లల్లో కిచెన్ ఉండదని చెప్పారు. భారత్ ఈ ట్రెండ్‌ను అనుసరిస్తే.. రెస్టారంట్లలో పెట్టుబడులు పెరిగి, భారీ అవకాశాలు అందుబాటులోకి వస్తాయి. అయితే ఆ స్థాయి రెస్టారంట్ బ్రాండ్లు మన దగ్గర లేవు. ఆగ్నేయాసియా దేశాల తరహాలో పాపులర్ బ్రాండ్లను సృష్టిస్తే భారత్‌లో హోటల్ రంగం పుంజుకుంటుంది. అక్కడికి, మనవద్ద వినియోగంలో తేడా ఏముంది..? తలసరి ఆదాయం పెరిగితే ఆ తరహా మార్పు వస్తుందా..?” అని పోస్టు పెట్టారు. భారతీయులు ఇంటి ఆహారం వైపే మొగ్గు చూపుతున్నారని కామత్ తెలిపారు. చైనా, అమెరికా, సింగపూర్, దక్షిణకొరియాల్లో బయటి ఆహారంపై ఎక్కువగా ఆధారపడుతున్నారని వివరణాత్మకంగా వెల్లడించారు. యూఎస్‌లో 55 శాతం ఆహార పరిశ్రమ వ్యవస్థీకృతమై ఉండగా భారత్‌లో 30 శాతమే ఉందన్నారు. ఇదిలాఉంటే.. భారత్‌లో ఇటీవల ఆహారపు అలవాట్లలో మార్పులు వస్తున్నాయని, ఎక్కువమంది పోషకాహారంపై దృష్టిసారిస్తున్నారని తెలిపారు. కాగా, ఈ పోస్టుపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. చాలామంది ఇంటి ఆహారానికి అనుకూలంగా స్పందించారు. ఇంటి ఆహారాన్ని ప్రోత్సహించకుండా.. ఈ వివరణ ఇవ్వడాన్ని కొందరు వ్యతిరేకించారు. బయట శుచికరమైన ఆహారం దొరుకుతుందా..? అని ప్రశ్నించారు.

## భారత్‌లో డాన్‌సెంటర్‌ను ప్రారంభించిన ఓయో సంస్థ




గ్లోబల్ ట్రావెల్ టెక్నాలజీ సంస్థ ‘ఓయో’కు సంబంధించిన మాతృ సంస్థ ఒరావెల్ స్టేస్, తన యూరోపియన్ హాలిడే హోం బ్రాండ్ డాన్ సెంటర్‌ను భారత్‌లో ప్రారంభించినట్లు ప్రకటించింది. భారత్‌లో నార్త్ గోవాలోని సియోలిమ్‌లో విలాసవంతమైన విల్లాలతో డాన్‌సెంటర్ ప్రారంభం కానుంది. డాన్‌సెంటర్‌ను ఓయో వెకేషన్ హోమ్స్ 2019లో కొనుగోలు చేసింది. అప్పటి నుంచి కంపెనీ యూరప్‌లో తన ఉనికిని గణనీయంగా విస్తరించింది. దేశ అతిథులకు కొత్తగా నిర్మించిన ప్రాపర్టీల ద్వారా ప్రీమియం బ్రాండ్ అనుభవాన్ని అందించేందుకు కట్టుబడి ఉన్నామని తెలిపింది. దీనికి గాను గోవాలో ప్రీమియం సర్వీస్డ్ అపార్ట్‌మెంట్లను ప్రారంభించేందుకు ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ప్రావిడెంట్ గ్రూప్‌తో ఓయో చర్చలు జరుపుతోంది. భారత్‌లో విలాసవంతమైన హాలిడే హోమ్ రెంటల్స్‌కు క్రమంగా డిమాండ్ పెరుగుతుందని ఒరావెల్ స్టేస్, లగ్జరీ బిజినెస్ హెడ్ ఆదిత్య శర్మ అన్నారు. డాన్‌సెంటర్, పూర్తి సర్వీస్ వెకేషన్ ఆధారిత హోం మేనేజ్‌మెంట్ కంపెనీ. ఇది బహుళ ఆన్‌లైన్ ట్రావెల్ ఏజెంట్లు, దాని వెబ్‌సైట్ ద్వారా డిమాండ్‌ను పెంచి ఇంటి యజమానులకు ఆదాయాన్ని పెంచుకోవడంలో సహాయపడుతుంది. 1957లో డెన్మార్క్‌లో స్థాపితం అయిన డాన్‌సెంటర్, ప్రస్తుతం డెన్మార్క్‌తో పాటు, స్వీడన్, నార్వే, జర్మనీ అంతటా 12 వేల ప్రాపర్టీలను నిర్వహిస్తోంది.

# బ్యాటింగ్ ధీమా.. బౌలింగ్ బెంగ..

## నేటి నుంచే మన ఆట!

గత వన్డే ప్రపంచకప్ తర్వాత టీమ్ఇండియా టెస్టులు, టీ20లకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఫలితంగా పొట్టి కప్‌ను అలవోకగా సొంతం చేసుకుంది. ఇప్పుడు ఛాంపియన్స్ ట్రోఫీ బరిలోకి దిగేందుకు సిద్ధమైంది. ఈనెల 20 నుంచి మన మ్యాచ్‌లు మొదలవుతున్నాయి. మరి ఈ టోర్నీకి భారత్ తన అన్ని అస్త్రాలు సిద్ధం చేసుకుందా? ఇది ఛాంపియన్స్ ట్రోఫీ విన్నింగ్ టీమేనా?



### బ్యాటింగ్ బాధే లేదు!

రోహిత్ శర్మ నాయకత్వంలోని భారత జట్టు వన్డే ప్రపంచకప్ ఫైనల్‌కు అప్రతిహతంగా చేరిన సంగతి తెలిసిందే. అహ్మదాబాద్‌లో తుది పోరు మినహా ఆ టోర్నీలో వరుసగా పది మ్యాచుల్లో టీమ్ఇండియా గెలిచింది. అయితే ఆ తర్వాత టెస్టులు, టీ20లు ఎక్కువగా ఆడింది. రోహిత్, విరాట్ కోహ్లీ తిరిగి ఫామ్‌లోకి రావడం ఛాంపియన్స్ ట్రోఫీ కి ముందు భారత్‌కు చాలా పెద్ద గుడ్ న్యూస్. ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో హిట్ మ్యాన్ సెంచరీ కొట్టగా.. విరాట్ కోహ్లీ మూడో మ్యాచ్‌లో అర్ధశతకం చేశాడు. అటు వైస్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కూడా నిలకడగా సత్తా చూపించాడు. శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్, అక్షర్ పటేల్, హార్దిక్ పాండ్య కూడా మంచి టచ్‌లోకి వచ్చారు.

ఇంగ్లండ్‌తో సిరీస్ ముందువరకు మిడిలార్డర్‌లో ఎవరు భరోసా ఇస్తారనే దానికి సరైన సమాధానం వచ్చింది. నాలుగో స్థానంలో శ్రేయస్ అయ్యర్ సాధికారికంగా పరుగులు రాబట్టడం మనం చూశాం. ఇక అక్షర్ పటేల్ కూడా ప్రమోషన్‌తో ఐదో స్థానంలో ముందుకొచ్చాడు. అక్కడా అదరగొట్టాడు. కేఎల్ రాహుల్ ఆరో స్థానంలో వచ్చి కాస్త ఇబ్బందిపడినా.. అప్పటికే జట్టు విజయం ఖరారవడంతో పెద్దగా ప్రభావం చూపించలేదు. మళ్లీ ఐదో స్థానంలోకి వచ్చి అతడు కీలక ఇన్నింగ్స్ ఆడాడు. గంభీర్ మాత్రం తాను లెఫ్ట్ – రైట్ కాంబినేషన్ వైపే ఉంటానని స్పష్టంచేసినట్లు వార్తలు వచ్చాయి. లోయర్ ఆర్డర్‌లో ఎలానూ హార్దిక్, రవీంద్ర జడేజాతో బ్యాటింగ్ లైనప్ దుర్భేద్యంగా మారింది. ఈ లెక్కన బ్యాటింగ్ విషయంలో ఎలాంటి డౌటూ అక్కర్లేదు.

ఛాంపియన్స్ ట్రోఫీ ముంగిట పెద్ద షాక్ తగిలింది. స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా లేకుండానే భారత్ బరిలోకి దిగాల్సిన పరిస్థితి ఎదురైంది. గత ఆస్ట్రేలియా పర్యటన చివర్లో వెన్నునొప్పి కారణంగా తీవ్రంగా ఇబ్బందిపడటమే దీనికి కారణం. అప్పట్నుంచి విశ్రాంతి తీసుకున్నప్పటికీ.. బౌలింగ్ వేసేంత ఫిట్‌నెస్ సాధించలేకపోయాడు. అతడి విషయంలో రిస్క్ తీసుకోని మేనేజ్‌మెంట్ అతడిని తప్పించి యువ పేసర్ హర్షిత్ రాణా ను తీసుకుంది. ఇంగ్లండ్ పైనే వన్డే అరంగేట్రం చేసిన హర్షిత్ నాణ్యమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఇక దుబాయ్ పిచ్ స్పిన్‌కు అనుకూలంగా ఉంటుందనే అంచనాతో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తికి అవకాశం ఇచ్చింది. ఆడిన ఒక వన్డేలో గొప్ప ప్రభావం చూపించకపోయినా అతడిపై మాత్రం మేనేజ్‌మెంట్ నమ్మకం ఉంచింది. జట్టులో ఉన్న ఏకైక సీనియర్ పేసర్ మహ్మద్ షమీ గాయం నుంచి కోలుకొని ఇటీవల జట్టులోకి వచ్చాడు. అయితే ఇంకా అంత ప్రభావవంతంగా కనిపించడం లేదు. ఇంగ్లండ్‌తో వన్డే, టీ20 సిరీస్‌లో ఆడి ఫర్వాలేదనిపించాడు. దీంతో ఛాంపియన్స్ ట్రోఫీలో ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో అనే భయం అభిమానుల్లో మొదలైంది. ఇంత పెద్ద టోర్నీలో అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా లాంటి ఇద్దరు అనుభవలేమి పేసర్లతో బరిలోకి దిగడం ఇబ్బందికరమే. ఇక రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్‌దీప్ యాదవ్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి రూపంలో ఐదుగురు స్పిన్నర్లు ఎందుకు అనే ప్రశ్న ఎలాగూ ఉంది. ఒకరిని తగ్గించి మహ్మద్ సిరాజ్‌ను తీసుకెళ్లాల్సింది అనే వాదనలూ వినిపిస్తున్నాయి. అక్కడి మైదానాలకు తగ్గట్టుగా అదనపు పేసర్ ఉంటే బెటర్ అనేది విశ్లేషకుల మాట. ఈ లెక్కన బౌలింగ్ విభాగం విషయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నట్లే.

### గంభీర్‌కి తొలి టోర్నీ..

భారత క్రికెట్ జట్టుకు గౌతమ్ గంభీర్ కోచ్ అయ్యాక.. జరుగుతున్న తొలి ఐసీసీ టోర్నీ ఇది. ఇప్పటివరకు జరిగిన ద్వైపాక్షిక సిరీసుల్లో అతడి కోచింగ్‌లో వచ్చిన కొన్ని ఓటములు అభిమానుల్ని కాస్త కలవరపెట్టినా.. ఐసీసీ టోర్నీలో ఇబ్బందికర ఫలితం వస్తే ప్రశ్నించే నోళ్లు, ఎత్తి చూపే వేళ్లు పెరుగుతాయి. కాబట్టి గంభీర్ కూడా ఈ విషయంలో సీరియస్‌గా ప్రయత్నాలు చేస్తుంటాడు. ఇలాంటి సవాళ్లు గంభీర్‌కి చాలా ఇష్టం కూడానూ.



# టీపీఎల్ నిర్వహణకు ఎస్ఆర్‌హెచ్ సహకారం

- రాష్ట్రంలో క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు
- ఉప్పల్ స్టేడియంలో మల్టీ లెవల్ పార్కింగ్‌కు కసరత్తు
- ఐపీఎల్ మ్యాచ్‌ల నిర్వహణపై సమన్వయ సమావేశం
- టిక్కెట్లు పారదర్శకంగా విక్రయించాలని సూచించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్ రావు
- వచ్చే నెల 2న ఐపీఎల్ ఏర్పాట్లపై ఉప్పల్ స్టేడియం పరిశీలన

**హైదరాబాద్ స్పోర్ట్స్:** తెలంగాణ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) నిర్వహించేందుకు సహకారం అందించాలని సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టు యాజమాన్యాన్ని హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు కోరారు. బుధవారం ఉప్పల్ స్టేడియంలో ఎస్ఆర్‌హెచ్ జట్టు యాజమాన్యంతో జరిగిన సమన్వయ సమావేశంలో జగన్‌మోహన్ రావు, ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, సంయుక్త కార్యదర్శి బసవరాజు, కోశాధికారి సీజే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానంగా రాష్ట్రంలో క్రికెట్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి తోడ్పాటు అందించాలని ఎస్ఆర్‌హెచ్‌కు జగన్‌మోహన్ రావు విజ్ఞప్తి చేశారు. అలాగే ఐపీఎల్ రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉప్పల్‌లో మల్టీలెవల్ పార్కింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు ఎస్ఆర్‌హెచ్ నుంచి సహకారం కావాలని కోరారు. టీపీఎల్ నిర్వహణ, రాష్ట్రంలో క్రికెట్ అభివృద్ధి కార్యక్రమాలకు తమ వైపు నుంచి సంపూర్ణ సహకారమందిస్తామని ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధులు హామీ ఇచ్చారు. ఉప్పల్‌లో మల్టీలెవల్ పార్కింగ్ నిర్మాణంపై అంచనాలు రూపొందిస్తే వచ్చే ఏడాది పనులు ప్రారంభించేందుకు తమ వంతు సహాయం అందిస్తామని ఎస్ఆర్‌హెచ్ బృందం తెలిపింది. ఇక ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం పూర్తి పారదర్శకంగా జరగాలని, స్టేడియంలో తినుబండారాలను, శీతల పానియాలను సాధారణ రేట్లకే అమ్మాలని ఎస్ఆర్‌హెచ్ బృందానికి జగన్‌మోహన్ రావు సూచించారు. వచ్చే నెల 2న హెచ్‌సీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యులు–ఎస్ఆర్‌హెచ్ బృందం సంయుక్తంగా ఐపీఎల్ ఏర్పాట్లపై స్టేడియం మొత్తాన్ని పరిశీలించనున్నామని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఆర్‌హెచ్ నుంచి సీఈఓ షణ్ముగం, డైరెక్టర్ కిరణ్, జీఎం శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐసీసీ ర్యాంకుల్లో శుభ్‌మన్ గిల్ హవా



ఐసీసీ తాజా వన్డే ర్యాంకింగ్స్?లో టీమ్ఇండియా యంగ్ బ్యాటర్ శుభ్?మన్ గిల్ సత్తా చాటాడు. ఇంగ్లాండ్ సిరీస్‌లో అదరగొట్టిన ఈ స్టార్ క్రికెటర్ తొలిసారి కెరీర్?లో అగ్రస్థానానికి చేరుకున్నాడు. తాజా ర్యాంకింగ్స్?లో ఒక స్థానం మెరుగుపర్చుకొని 796 రేటింగ్స్?తో టాప్?లో కొనసాగుతున్నాడు. కొంత కాలంగా అగ్రస్థానంలో ఉన్న పాకిస్థాన్ ప్లేయర్ బాబర్ ఆజమ్ (773 రేటింగ్స్) రెండో ప్లేస్?కు పడిపోయాడు. కెప్టెన్ రోహిత్ శర్మ (761 రేటింగ్స్) మూడో స్థానంలో ఉండగా, విరాట్ కోహ్లీ (727 రేటింగ్స్) 6వ ప్లేస్?లో కొనసాగుతున్నాడు. ఇదిలా ఉండగా, వన్డేల్లో గిల్ టాప్ బ్యాటర్‌గా నిలవడం ఇది రెండోసారి. అంతకుముందు 2023లో వన్డే ప్రపంచకప్ జరుగుతున్న సమయంలోనూ బాబర్‌ను దాటి గిల్ నంబర్ వన్ పొజిషన్?కు దూసుకెళ్లాడు. రీసెంట్?గా భారత్?లో జరిగిన ఇంగ్లాండ్ సిరీస్‌లో గిల్ అదరగొట్టి రికార్డుకెక్కాడు. మూడు మ్యాచ్‌ల్లో ఒక సెంచరీ, అలాగే రెండు హాఫ్? సెంచరీలు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును అందుకున్నాడు. ఇదిలా ఉండగా, బౌలర్ల ర్యాంకింగ్స్?లో శ్రీలంక స్టార్ ప్లేయర్ మహీశ్ తీక్షణ నంబర్ వన్ పొజిషన్?కు చేరుకున్నాడు. అఫ్గానిస్థాన్ కెప్టెన్ రషీద్ ఖాన్‌ను దాటి అతడు ఈ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. నమీబియా ప్లేయర్ బెర్నార్డ్ స్కోల్జ్ మూడో స్థానాన్ని సాధించగా, టీమ్ఇండియా బౌలర్? కుల్‌దీప్ యాదవ్ నాలుగో స్థానానికి చేరుకన్నాడు. రీసెంట్?గా గిల్? కెరీర్?లో ఇది తనకు 50వ వన్డే మ్యాచ్?ను ఆడాడు. ఈ క్రమంలో భారత్ తరఫున 50వ వన్డేలో సెంచరీ సాధించిన తొలి బ్యాటర్?గా రికార్డుకెక్కాడు.గిల్ కన్నా ముందు ఏ భారత ఆటగాడు కూడా 50వ మ్యాచ్?లో శతకం బాదలేదు. 50 మ్యాచ్?ల్లోనే గిల్ 2500 పరుగుల మార్క్? దాటాడు. ఈ క్రమంలో వన్డేల్లో అత్యధిక వేగంగా ఈ మైలురాయి అందుకున్న ఆటగాడిగా నిలిచాడు. ఇదివరకు ఈ రికార్డ్ సౌతాఫ్రికా బ్యాటర్ హషీమ్ ఆమ్లా (51 మ్యాచ్?ల్లో) పేరిట ఉంది. తాజా మ్యాచ్?తో గిల్ ఆ రికార్డ్? బద్దలు కొట్టాడు. గిల్ వన్డేల్లో ఇప్పటివరకు 2587 పరుగులు చేశాడు.

# నెట్ బౌలర్ తో రోహిత్ సరదా చిట్ చాట్



ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ కోసం దుబాయ్ వెళ్లిన టీమిండియా ఆటగాళ్లు అక్కడ విపరీతంగా ప్రాక్టీస్ చేస్తున్నారు. దాదాపుగా అందరు ప్లేయర్ల కఠోర శిక్షణ తీసుకుంటున్నారు. తాజాగా కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ, వికెట్ కీపర్ కేఎల్ రాహుల్, శుభమాన్ గిల్, హార్దిక్ పాండ్యా తదితరులు తమ బ్యాటింగ్ కు పదును పెడుతున్నారు. ఇక నెట్ సెషన్ లో స్థానిక బౌలర్ అహ్మద్ ను రోహిత్ ప్రశంసించాడు. లెఫ్టార్మ్ పేసరైన అహ్మద్ పదే పదే యార్కర్లు విసురుతూ బ్యాటర్లను ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశాడు. షాహిన్ షా అఫ్రిది, ట్రెంట్ బౌల్ట్ ను పోలి ఉండే అతని యాక్షన్ లో యార్కర్లను చూసి రోహిత్ ముచ్చట పడ్డాడు. ట్రైనింగ్ సెషన్ ముగిశాక అతనితో సరదాగా చిట్ చాట్ చేశాడు. ట్రైనింగ్ లోనే తమ కాళ్లు విరగ్గొడతావా..? అని చమత్కారంగా మాట్లాడాడు. తాజాగా ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరలైంది. అభిమానులు తమకు తోచిన కామెంట్లు చేస్తూ, లైకులు, షేర్లతో పోస్టు చేస్తున్నారు. ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని మూడోసారి నెగ్గాలని భారత్ పట్టుదలగా ఉంది. 2002, 2013లో టోర్నీని నెగ్గిన టీమిండియా, 2017లో రన్నరప్ గా నిలిచింది. దీంతో ఈసారి ఎలాగైనా టోర్నీని నెగ్గాలని ప్రణాళికలు రచిస్తోంది. ఇక రెగ్యులర్ వికెట్ కీపర్ గా బరిలోకి దిగుతున్న కేఎల్ రాహుల్ తన హిట్టింగ్ జోరును పెంచాడు. భారీ షాట్లను ఆడుతూ ప్రాక్టీస్ లో కనిపించాడు. హార్దిక్ కూడా పలురకాల షాట్లను ప్రాక్టీస్ చేశాడు. ఇంగ్లాండ్ తో జరిగిన వన్డే సిరీస్ లో రెండు ఫిఫ్టీలు, ఒక సెంచరీతో రాణించి ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు పొందిన గిల్.. పుల్ షాట్లు ఆడుతూ కనిపించాడు. రోహిత్ తన ట్రేడ్ మార్కు పుల్ షాట్లు ఆడగా, కోహ్లీ.. బంతిని మిడిల్ చేయడంపై దృష్టి సారించాడు. పాకిస్థాన్ లో బుధవారం నుంచి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్ లో న్యూజిలాండ్ తో పాక్ ఢీకొంటుంది. ఈనెల 19 నుంచి మార్చి 9 వరకు ఈ టోర్నీ జరుగుతుంది. బారత్ ఆడే మ్యాచ్ లు హైబ్రీడ్ పద్ధతిలో జరుగుతాయి. ఈనెల 20 బంగ్లాదేశ్, 23న చిరకాల ప్రత్యర్థి, ఆతిథ్య పాక్ , మార్చి 2న న్యూజిలాండ్ తో తలపడనుంది. భారత్ ఆడే మ్యాచ్ లన్నీ దుబాయ్ లోనే జరుగుతాయి. గ్రూపు–ఎలో భారత్ బరిలోకి దిగుతోంది. ఈ గ్రూపులో భారత్ తో పాటు పాక్, బంగ్లా, కివీస్ ఉన్నాయి. గ్రూపులో టాప్–2లో నిలిచిన జట్లు నేరుగా సెమీస్ కు చేరుతాయి.



# పాక్ గడ్డపై ఎగిరిన భారత జెండా!

శత్రు దేశం పాకిస్థాన్ గడ్డపై ఎట్టకేలకు భారత మువ్వెన్నల పతాకం రెపరెపలాడింది. కరాచీ స్టేడియం వేదికగా ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ ఘనంగా ప్రారంభమైంది. ఆతిథ్య పాకిస్థాన్, న్యూజిలాండ్ మధ్య తొలి మ్యాచ్ ప్రారంభమైంది. ఈ మ్యాచ్ సందర్భంగా కరాచీ స్టేడియం పైకప్పుపై ఈ టోర్నీలో బరిలోకి దిగిన 8 దేశాల జెండాలను ఎగరవేసారు. అయితే రెండు రోజుల క్రితం జెండా వివాదం నెలకొన్న విషయం తెలిసిందే. కరాచీ, లాహోర్ మైదానాల్లో భారత్ జెండాను పీసీబీ ఎగరవేయలేదు. మిగతా ఏడు జట్ల జెండాలను ఎగరవేసింది. ఇందుకు సంబంధించిన వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఈ ఘటనపై భారత అభిమానులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. పీసీబీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. పాకిస్థాన్ తన నీచ బుద్ధిని బయటపెట్టుకుందని మండిపడ్డారు. ఈ టోర్నీ కోసం భారత జట్టు పాకిస్థాన్‌లో పర్యటించకపోవడంతోనే పీసీబీ జెండాను ఎగరవేయలేదని ఆ దేశ నెటిజన్లు, జర్నలిస్టులు సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పీసీబీ కూడా స్పందించింది. 'ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ మ్యాచ్‌లు ఆడేందుకు పాకిస్థాన్‌కు భారత్ రావట్లేదు. కరాచీ, రావల్పిండి, లాహోర్ స్టేడియాల్లో మ్యాచ్‌లు ఆడుతున్న జట్ల జెండాలను మాత్రమే ఎగరవేశాం. భారత్ తన మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. బంగ్లాదేశ్ కూడా ఇంకా పాకిస్థాన్‌కు రాలేదు. ఆ జట్టు తమ తొలి మ్యాచ్‌ను భారత్‌తో ఆడనుంది. కాబట్టి భారత్, బంగ్లాదేశ్ జెండాలను ఇంకా ఎగరవేయలేదు. పాకిస్థాన్‌కు వచ్చిన మిగతా జట్ల జాతీయ పతకాలను మాత్రమే ఎగరవేసాం. ఈ జెండాల గురించి పీసీబీ అధికారికంగా స్పందించాల్సిన అవసరం లేదు.'అని ఆ బోర్డు వర్గాలు మీడియాకు తెలిపాయి. ఈ వ్యవహారంపై బీసీసీఐ ఆగ్రహం వ్యక్తం చేసింది. టోర్నీలో భాగమయ్యే అన్ని దేశాల జెండాలను ఎగరవేయాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా భారత జెండా ఎగరవేయాలని పేర్కొన్నారు. ఇక తొలి మ్యాచ్ సందర్భంగా భారత జెండాను ఎగరవేసి ఈ వివాదానికి పీసీబీ ముగింపు పలికింది. ప్రస్తుతం కరాచీ స్టేడియం ఎగురుతున్న భారత జెండా వీడియో, ఫొటోలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆటగాళ్ల భద్రతను కారణంగా చూపిస్తూ పాకిస్థాన్‌లో పర్యటించేందుకు బీసీసీఐ అభ్యంతరం చెప్పిన విషయం తెలిసిందే. దాంతో ఈ టోర్నీని హైబ్రిడ్ మోడల్‌లో నిర్వహించేలా పీసీబీని ఐసీసీ ఒప్పించింది. ఇందుకుగానూ బీసీసీఐ–పీసీబీల మధ్య ఓ ఒప్పందం జరిగింది. భారత్ వేదికగా జరిగే ఐసీసీ టోర్నీల్లోనూ తమ మ్యాచ్‌లను తటస్థ వేదికగా నిర్వహించాలని పీసీబీ కోరగా.. అందుకు బీసీసీఐ అంగీకరించింది.

# బంగ్లాపై ఆ ఆధిపత్యం కొనసాగేనా..?



ఛాంపియన్స్ ట్రోఫీ సమరానికి టీమ్ఇండియా సిద్ధమైంది. ఇంగ్లాండ్‌తో వన్డే సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేసి రెట్టించిన ఉత్సాహంతో ఈ మెగా టోర్నీలోకి రోహిత్ సేన అడుగుపెడుతోంది. మొదటి మ్యాచ్‌లో భారతే ఫేవరేట్ అయినప్పటికీ.. ప్రత్యర్థి బంగ్లాను తక్కువ అంచనా వేయడానికి వీల్లేదు. సెమీస్‌కు చేరాలంటే ప్రతి మ్యాచ్ కీలకమే.

### రో-కో మరోసారి చెలరేగితే..

గత కొంతకాలంగా పేలవ ప్రదర్శనతో తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న సారథి రోహిత్ శర్మ ఇంగ్లండ్‌తో రెండో వన్డేలో సెంచరీతో చెలరేగిన విషయం తెలిసిందే. మరోవైపు స్టార్ బ్యాటర్ కోహ్లీ కూడా పుంజుకున్నాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు వీరు తిరిగి తమ ఫామ్‌నందుకోవడం టీమ్ఇండియాకు శుభపరిణామం. మరోవైపు బంగ్లా అంటే చెలరేగి ఆడే వీరిద్దరూ మరోసారి రాణిస్తే.. భారత్‌కు తిరుగుండదు. గత 2017 ఛాంపియన్స్ ట్రోఫీ సీజన్‌లో బంగ్లాపై రోహిత్–కోహ్లీల ప్రదర్శనను ఎవ్వరూ మరిచిపోలేరు. ఆ మ్యాచ్‌లో రోహిత్ 123 పరుగులతో చెలరేగగా.. కోహ్లీ 96 పరుగులు చేశాడు. దీంతో 9 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించింది. మరోసారి వీరిద్దరూ బంగ్లాపై అలాంటి ప్రదర్శన చేయాలని అభిమానులు కోరుకుంటున్నారు. వీరితోపాటే శుభ్‌మన్ గిల్ రాణిస్తే భారత్‌కు భారీ స్కోరు ఖాయమే.

### జట్టు కూర్పు ఎలా..?

ఐదుగురు స్పిన్నర్లు జట్టులో ఉన్న నేపథ్యంలో తుది జట్టులో ఎవరిని ఆడిస్తారనేది ఆసక్తికరంగా మారింది. మరోవైపు స్టార్ పేసర్ బుమ్రా లేని లోటుని షమీ నేతృత్వంలోని పేస్ దళం తీర్చాల్సి ఉంటుంది. ప్రత్యర్థిని కట్టడి చేయడానికి సారథి రోహిత్ శర్మ, కోచ్ గంభీర్ ఎలాంటి వ్యూహాలతో వస్తారో చూడాలి. మరోవైపు ప్రత్యర్థి బంగ్లా మహ్మదుల్లా, మిరాజ్, ముస్తాఫిజుర్ లాంటి స్టార్లపై ఆశలు పెట్టుకుంది. ఈ ట్రోఫీలో బంగ్లాపై పెద్దగా అంచనాలు లేనప్పటికీ.. తనదైన రోజున ఎంతటి ప్రత్యర్థికైనా సవాల్ విసిరే సత్తా ఆ జట్టుకుంది. ఇక వన్డే ఫార్మాట్‌లో బంగ్లాపై భారత్‌దే పూర్తి ఆధిపత్యం.

# ఛాంపియన్స్ ట్రోఫీ..

## న్యూజిలాండ్ చేతిలో పాకిస్థాన్ చిత్తు



**ఇస్లామాబాద్:** ఛాంపియన్స్ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో న్యూజిలాండ్ చేతిలో పాకిస్థాన్ ఓటమిపాలైంది. పాక్‌పై కివీస్ 60 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 50 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 320 పరుగులు చేసింది. విల్ యంగ్ (107, 113 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్), టామ్ లేథమ్ (118, 104 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్స్‌లు) శతకాలతో విరుచుకుపడ్డారు. గ్లెన్ ఫిలిప్స్ (61, 39 బంతుల్లో 3 ఫోర్లు, 4 ఫోర్లు) దూకుడుగా ఆడి అర్ధ శతకం బాదాడు. పాక్ బౌలర్లలో నసీమ్ షా 2, హారిస్ రవూఫ్ 2, అబ్రార్ అహ్మద్ ఒక వికెట్ పడగొట్టారు. అనంతరం 321 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ 47.2 ఓవర్లలో 260 పరుగులకు ఆలౌటైంది. పాక్ బ్యాటర్లలో ఖుష్‌దిల్ (69, 49 బంతుల్లో), బాబర్ అజామ్ (64బీ 90 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్), సల్మాన్ అఘా (42, 28 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) మాత్రమే పోరాడారు. సౌద్ షకీల్ (6), మహ్మద్ రిజ్వాన్ (3), తయ్యబ్ తాహిర్ (1) సింగిల్ డిజిట్ స్కోరుకే పరిమితమయ్యారు. కివీస్ బౌలర్లలో విలియం ఓరోర్క్ 3, మిచెల్ శాంట్నర్ 3, మ్యాట్ హెన్రీ 2, మైఖేల్ బ్రాస్‌వెల్, నాథన్ స్మిత్ చెరో వికెట్ తీశారు.



## రాజమౌళి - రష్మీ ఓ సరదా లవ్ ట్రాక్..

భారీ బడ్జెట్ చిత్రాలతో దేశ విదేశాల్లో పేరు ప్రఖ్యాతులు సొంతం చేసుకున్నారు దర్శక ధీరుడు రాజమౌళి. దర్శకుడిగానే కాకుండా నటుడిగానూ ఆయన ప్రేక్షకులకు సుపరిచితమే. 'సై', 'మజ్ను', 'బాహుబలి', 'కల్కి 2898 ఏడీ' వంటి చిత్రాల్లో అతిథి పాత్రల్లో కనిపించి సినీ ప్రియులను ఆశ్చర్యపరిచారు. గతంలో ఆయన ఓ ధారావాహికలోనూ యాక్ట్ చేశారు. దీనికి సంబంధించిన రేర్ వీడియో వైరల్‌గా మారింది. యాంకర్‌గా గుర్తింపుపొందిన నటి రష్మీ.. కెరీర్ ఆరంభంలో పలు టీవీ సీరియల్స్ కోసం వర్క్ చేసిన విషయం తెలిసిందే. ఆమె ప్రధాన పాత్రలో యాక్ట్ చేసిన సీరియల్ 'యువ'. యూత్‌ఫుల్ కంటెంట్‌తో నాటి యువతను విశేషంగా ఆకట్టుకున్న ఈ సీరియల్‌లో జక్కన్న గెస్ట్ రోల్‌లో కనిపించారు. ఇందులో రాజమౌళి - రష్మీపై ఒక సరదా లవ్ ట్రాక్ ఉంటుంది. 'ఐ లవ్ యూ' అంటూ ఆమె తన మనసులోని మాట చెబుతుంది. దీనికి సంబంధించిన ఓ వీడియో ఇప్పుడు నెట్టింట వైరల్‌గా మారింది. దీనిని చూసిన నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. వీరిద్దరూ ఎప్పుడు నటించారు? ఇదెప్పుడు జరిగిందంటూ కామెంట్స్ పెడుతున్నారు. మరికొందరేమో ఇది నిజం కాదని.. ఏఐ జనరేటెడ్ వీడియో అని అనుకుంటున్నారు.

# ప్రభాస్ స్పిరిట్ ప్రాజెక్టులో డైరెక్టర్ వంగా కండీషన్స్



అగ్ర కథానాయకుడు ప్రభాస్, అర్జున్ రెడ్డి, యానిమల్ చిత్రాల దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కాంబోలో రాబోతున్న భారీ బడ్జెట్ చిత్రం 'స్పిరిట్'. దాదాపు రూ. 300 కోట్లకు పైగా బడ్జెట్‌తో రానున్న ఈ మూవీని టీ సిరీస్, భద్రకాళి పిక్చర్స్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం నుంచి అప్‌డేట్స్ కోసం ప్రభాస్ అభిమానులంతా కళ్ళు కాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ చిత్రం ఈ ఏడాది సమ్మర్‌లో సెట్స్ మీదకి వెళ్లనున్నట్లు టాక్ నడుస్తుంది. ఇదిలావుంటే ఈ సినిమా కోసం దర్శకుడు సందీప్ వంగా నటినటులందరికి కండిషన్స్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే రాజమౌళి ఎస్ఎస్ఎంబీ ప్రాజెక్ట్ కోసం చిత్రబృందానికి కండిషన్స్ పెట్టిన విషయం తెలిసిందే. రాజమౌళి సినిమా కంప్లీట్ అయ్యేంతవరకు మూవీకి సంబంధించిన ఎటువంటి అప్‌డేట్‌లను బయటపెట్టడానికి వీల్లేదంటూ బాండ్ కూడా రాయించుకున్నాడు రాజమౌళి. అయితే ఇదే పనిని ఇప్పుడు సందీప్ కూడా చేయబోతున్నట్లు తెలుస్తుంది. ప్రభాస్‌తో తెరకెక్కించబోతున్న సినిమాకి సందీప్ కండిషన్స్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. ఇందులో భాగంగానే సినిమాలో నటించే నటినటులతో పాటు హీరో హీరోయిన్లకి కూడా ఎటువంటి అప్‌డేట్స్ బయటపెట్టవద్దని బాండ్ రాసుకోబోతున్నట్లు తెలుస్తుంది. అలాగే ఈ సినిమాలో ప్రభాస్ లుక్‌కి సంబంధించి కూడా సందీప్ కండిషన్స్ పెట్టబోతున్నట్లు తెలుస్తుంది. మూవీలో ప్రభాస్ లుక్ కీలకం అని.. ఒకవేళ సినిమా షూటింగ్ మధ్యలో లుక్ మార్చుకున్న సినిమాకి ఎఫెక్ట్ పడుతుందని అందుకనే ఏది మార్చకుండా సినిమా అయ్యేవరకు ప్రభాస్ అలానే ఉండలాని సందీప్ ఆలోచిస్తున్నట్లు సమాచారం.



## ఐపీఎస్, ఐఎఎస్‌లు పాసవ్వొచ్చు..

సినిమా ఇండ్రస్ట్రీలోకి అమ్మాయిలు రావడంపై ఆసక్తికర విషయాలను పంచుకుంటి నటి ధన్య బాలకృష్ణన్. ఆమె కీలక పాత్రలో వస్తున్న తాజా చిత్రం బాపు ఏ ఫాదర్స్ సూసైడ్ స్టోరీ.. అనేది ఉపశీర్షిక. సీనియర్ నటులు బ్రహ్మాజీ, ఆమని, బలగం సుధాకర్ రెడ్డి ప్రధాన పాత్రల్లో వస్తున్న ఈ సినిమాకు దయా దర్శకత్వం వహిస్తుండగా.. అవసరాల శ్రీనివాస్, ధన్య బాలకృష్ణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించారు మేకర్స్. అయితే ఈ వేడుకలో ధన్య మాట్లాడుతూ.. బాపు అనే సినిమా నా కెరియర్‌లో నేను ఎప్పుడూ నా లైఫ్‌లో మర్చిపోని ఒక ప్రాజెక్ట్ ఇది. ఎందు కంటే ఎందుకంటే ఫస్ట్ టైం నా బాపు నాకు ఫోన్ చేసి చాలా గర్వంగా ఉందని చెప్పాడు ఈ సినిమా చేసినందుకు. సిటీ అనేది ఒక శరీరం అయితే పల్లెటూరు అనేది దాని ఆత్మ. అందుకు పల్లెటూరు మీద వచ్చే సినిమాలలో ఒక ఆత్మ దాగి ఉంటుంది. అందుకే మా నాన్న చెబుతుండేవాడు. ఎప్పటికి ఒక పల్లెటూరు కథ చేయమని.. ఇన్ని రోజులకు ఆ కల నేరవేరింది. ముందుగా నేను నటి అవుదాం అనుకుంటున్నాను అని చెప్పినప్పుడు మా నాన్న ఒకే చెప్పినందుకు ఆయనకు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. సినిమా ఇండస్ట్రీలోకి అమ్మాయిలను పంపించడం అనేది చాలా పెద్ద విషయం. ఇండియాలో అయితే చెప్పాల్సిన పనిలేదు. మేము పాస్ అవ్వొచ్చు కానీ.. అమ్మ నాన్నల్ని ఒప్పించడం వాళ్ళ చుట్టాలు ఉన్న వాళ్ళని ఒప్పించడం అనేది చాలాకష్టం. అలాంటి పరిస్థితుల్లో నాన్న నన్ను నమ్మాడు. నేను ఇండ్రస్ట్రీకి వెళ్లిన అనంతరం కూడా ఎప్పుడు అక్కడ ఎలా ఉంది పరిస్థితి అని అడుగలేదు అంటూ ధన్య చెప్పుకోచ్చింది.



## అందుకే మా పెళ్లిలో నో ఫోన్ పాలసీ పెట్టాం : రకుల్ ప్రీత్ సింగ్

గతేడాది ఫిబ్రవరిలో వివాహబంధంలోకి అడుగుపెట్టారు రకుల్ ప్రీత్ సింగ్. గోవాలోని ఓ రిసార్ట్‌లో రకుల్- జాకీ భగ్నానీ పెళ్లి అత్యంత సన్నిహితుల మధ్య జరిగింది. తన పెళ్లిని సింపుల్‌గా ఎందుకు చేసుకున్నారో తాజాగా వివరించారు. పెళ్లిలో నో ఫోన్ పాలసీ పెట్టడానికి కారణం తెలిపారు. "మా పెళ్లిని చాలా సింపుల్‌గా చేసుకోవాలని ఎప్పటినుంచో అనుకున్నాం. లగ్జరీ కంటే సౌకర్యం ముఖ్యం. పెళ్లి జరిగిన విలువైన క్షణాలను ఎంజాయ్ చేశాం. సింపుల్‌గా పెళ్లి చేసుకోవడంలో ఒకరకమైన ఆనందం ఉంటుంది. వివాహం జరిగిన మూడు రోజులు మా జీవితంలో బెస్ట్‌గా ఉండాలనుకున్నాం. వివాహానికి వచ్చిన అతిథులు కూడా ఈ వేడుకను సెలబ్రేట్ చేసుకోవాలనుకున్నాం. అందుకే నో ఫోన్ పాలసీ పెట్టాం. అంతేకానీ, వాళ్లు మా పెళ్లి ఫొటోలు లీక్ చేస్తారని కాదు. ఈ వేడుక చిత్రాలను మేమే మొదట పంచుకోవాలని నిర్ణయించుకున్నాం. పెళ్లిలోని ప్రతి మూమెంట్‌ను డ్యాన్స్‌తో సెలబ్రేట్ చేసుకున్నాం. పెళ్లి దుస్తుల్లో కూడా డ్యాన్స్ వేశాం" అని రకుల్ తెలిపారు. కన్నడ చిత్రం 'గిల్లీ'తో తెరంగేట్రం చేసిన రకుల్ బాలీవుడ్, టాలీవుడ్ చిత్రాలతో మెప్పిస్తున్నారు. ప్రస్తుతం 'మేరే హస్బెండ్ కీ బీవీ' తో బిజీగా ఉన్నారు. అర్జున్ కపూర్ హీరోగా రకుల్ ప్రీత్ సింగ్, భూమి పెడ్నేకర్ ప్రధాన పాత్రల్లో రానున్న చిత్రమిది. ముదస్సర్ అజీజ్ దర్శకత్వంలో రూపొందింది. ఫిబ్రవరి 21న ప్రేక్షకుల ముందుకురానుంది. జాకీ భగ్నానీ, వాషు భగ్నానీ సంయుక్తంగా నిర్మించారు.



## గ్లామర్ పెంచేసిన వర్షబొల్లమ్మ

చైల్డ్ ఆర్టిస్ట్ గా వెండి తెరకు పరిచయమైంది అందాల భామ వర్ష బొల్లమ్మ. ఆతర్వాత పలు సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసింది. విజయ్ సేతుపతి హీరోగా నటించిన 96సినిమాలో స్టూడెంట్ గా కనిపించింది. అలాగే దళపతి విజయ్ నటించిన విజిల్ లోనూ ఆకట్టుకుంది. దళపతి విజయ్ విజిల్ సినిమాలో ఫుట్ బాల్ ప్లేయర్ గా కనిపించింది వర్ష. ఇక హీరోయిన్ గా మారిన తర్వాత ఆనంద్ దేవరకొండ హీరోగా నటించిన మిడిల్ క్లాస్ మెలోడీస్ తెలుగు తెరకు పరిచయమైంది. ఈ సినిమాలో తన క్యూట్ క్యూట్ ఎక్స్‌ప్రెషన్స్ తో ప్రేక్షకులను తన నటనతో ప్రేక్షకుల చూపును తనవైపు తిప్పుకుంది అందాల ముద్దుగుమ్మ వర్ష బొల్లమ్మ. పక్కింటి అమ్మాయిలా కనిపించే రూపంతో ఆకట్టుకుంటూ కుర్రకారును ఫిదా చేస్తోందీ బ్యూటీ.. తెలుగులో రీసెంట్ గా ఊరుపేరు భైరవకోన అనే సినిమాతో హిట్ అందుకుంది. ఈ మధ్య గ్లామర్ మీద కూడా ఫోకస్ పెడుతూ అప్పుడప్పుడు ఫొటోస్ తో ఆకట్టుకుంటుంది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ థన్ ఆ బ్యూటీఫుల్ ఫోటోలను అభిమానులతో పంచుకుంటుంది. ఈ ఫోటోలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి. తెలుగు, తమిళ్ భాషల్లో సినిమాలు చేస్తూ బిజీగా ఉన్న ఈ ముద్దుగుమ్మ ఇప్పుడు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తుంది. గ్లామరస్ ఫొటోలతో కుర్రకారుకు నిద్రపట్టకుండా చేస్తుంది ఈ వయ్యారి భామ.

## ఖుషీ కపూర్ సినిమా పరాజయం.. స్పందించిన రచయిత

ఖుషీ కపూర్, జునైద్ ఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'లవ్ యాపా'. కోలీవుడ్‌లో విజయాన్ని అందుకున్న 'లవ్ టుడే' చిత్రానికి రీమేక్‌గా ఈ సినిమా రూపొందిన విషయం తెలిసిందే. 'లవ్ యాపా' పరాజయంపై తాజాగా చిత్ర రచయిత స్నేహా దేశాయ్ స్పందించారు. ఇది రొటీన్ లవ్ స్టోరీ కాదని.. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఎక్కువమంది దీనిని చూసే వీలుందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ప్రేక్షకులపై ఒక సినిమా ఎలాంటి ప్రభావాన్ని చూపించిందనేది బాక్సాఫీస్ నంబర్లపై ఎప్పుడూ ఆధారపడి ఉండదు. 'లవ్ యాపా' విభిన్నమైన, ఫ్రెష్ లవ్ స్టోరీ. జెన్ జి ప్రేక్షకుల కోసం దీనిని రూపొందించారు. ఇందులోని కంటెంట్, కామెడీకి వారు బాగా కనెక్ట్ అవుతారు. బాలీవుడ్‌లో తెరకెక్కే రొటీన్ రొమాంటిక్ – కామెడీ చిత్రాల మాదిరిగా కాకుండా సరికొత్త సబ్జెట్ మూవీగా దీనిని సిద్ధం చేశాం. ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రేక్షకులు సినిమా వీక్షించే కోణంలో ఎన్నో మార్పులు వచ్చాయి. లార్జర్ దెన్ లైఫ్ చిత్రాలను మాత్రమే వారు థియేటర్లలో చూసేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. మిగిలిన చిత్రాలను ఓటీటీల్లో చూడాలనుకుంటున్నారు. ఆ కారణం వల్లనే మా సినిమాకు బాక్సాఫీస్ వద్ద సరైన కలెక్షన్స్ వచ్చి ఉండకపోవచ్చు. ఓటీటీలో ఇది తప్పకుండా విశేష ఆదరణ సొంతం చేసుకుంటుందని నమ్ముతున్నా. ఏది ఏమైనా బిగ్‌స్క్రీన్‌పై ఈ చిత్రాన్ని చూసిన వారు తమకు ఈ చిత్రం బాగా నచ్చిందని.. కంటెంట్ చాలా కొత్తగా ఉందని ప్రశంసలు కురిపించారు" అని ఆమె తెలిపారు. ప్రదీప్ రంగనాథన్ స్వీయ దర్శకత్వంలో తమిళంలో సూపర్‌హిట్ అందుకున్న చిత్రం 'లవ్ టుడే'.



నేటితరం యువతీ యువకుల ప్రేమ కథతో దీనిని రూపొందించారు. ఇదే చిత్రానికి రీమేక్‌గా 'లవ్ యాపా' సిద్ధమైంది. అద్వైత్ చందన్ దర్శకత్వం వహించారు. ప్రదీప్ రంగనాథన్ నిర్మాతగా వ్యవహరించారు. ఫిబ్రవరి 7న ఇది థియేటర్లలో విడుదలైంది.

## రక్తదానం చేసి అభిమానాన్ని చాటుకున్న మణిశర్మ

ఐ అండ్ బ్లడ్ బ్యాంక్‌ను అభిమానుల దానంతోనే ఈ బృహుత్ కార్యాన్ని నిర్వహిస్తున్నానని చిరంజీవి చెబుతుంటారు. విశేషం ఏమంటే... సాధారణ ప్రజలు, చిరంజీవి అభిమానులే కాదు... సినిమా రంగానికి చెందిన ప్రముఖ నటీనటులు, సాంకేతిక నిపుణులు సైతం చిరంజీవి బ్లడ్ బ్యాంక్‌కు రక్తదానం చేస్తుంటారు. కొంతమంది తమ జన్మదినాన్ని పురస్కరించుకుని కుటుంబ సభ్యులతో కలిసి రక్తదానం చేసిన సంఘటనలూ ఉన్నాయి. తాజాగా ప్రముఖ సంగీత దర్శకుడు మణిశర్మ రక్తదానం చేసి చిరంజీవిపై తనకున్న అభిమానాన్ని చాటుకున్నారు. ఇలా మణిశర్మ రక్తదానం చేయటం ఇది రెండోసారి. ఈ సందర్భంగా మణిశర్మ మాట్లాడుతూ "ఎప్పటి నుంచో రక్త దానం చేయాలని అనుకుంటున్నాను. నేను నా సంగీతాన్ని చిరంజీవిగారి సినిమాలకు అందించటం ద్వారా అభిమానాన్ని చాటుకున్నాను. ఇప్పుడు రక్తదానం చేయటం అనేది సంతోషంగా ఉంది. ఇది నా వంతు కర్తవ్యంగా భావిస్తున్నాను. లక్షలాది మంది ఇందులో భాగమయ్యారు. అందులో నేను ఒక బొట్టులాగా భావిస్తున్నాను. ఇలాంటి మంచి కార్యక్రమంలో అందరూ భాగం కావాలి" అన్నారు.



Editor, Publisher & Owner by Reddy Shekar,3-184, venkatapur, (m) venkatapur, mulugu dist, 506352, Printed at 16-48 SS Printers, (m) mulugu, mulugu. RNI No. TELTEL/2021/86151, E Mail : teenmaardesk@gmail.com, Cell : 9966847463